నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

నిజాల నిగ్గు తేల్చే చర్చ తెలుగు దిన పత్రిక

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 14

బుధవారం, అక్టోబర్ 08, 2025 , పేజీలు - 12 వెల: 2/-

## బిసి రిజర్వేషన్లపై

# నేడు హైకోర్టులో విచారణ

## మంత్రులు అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష

### అభిషేక్ సింఘ్వీతో తాజాగా చర్చ



హైదరాబాద్,అక్టోబర్ 7: బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షి స్తున్నారు. బుధవారం హైకోర్టు లో కేసు విచారణకు రానున్న సందర్భంగా మంత్రులు, న్యాయనిపుణలుతో చర్చించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. న్యాయ పోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని మిగతా2లో...

## పత్తి రైతులకు

# అండగా ఉంటాం

- సిసిఐకి మాత్రమే పంటలను అమ్ముకోవాలి
- కేంద్రమంత్రి గిరిరాజ్‌తో కిషన్ రెడ్డి చర్చలు



న్యూఢిల్లీ,అక్టోబర్ 7: పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి భరోసా కల్పించారు. అన్నదాతలు తక్కువ ధరకు పత్తిని బయట అమ్మవద్దని.. ఆలస్యమైన సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పత్తి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి పంటని అమ్మాలని సూచించారు. 12 శాతం కంటే తక్కువ తేమ ఉన్న కాటన్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పంటని అమ్మడానికి 122 పత్తి కొనుగోలు కేంద్రాలు ఉంటాయని.. ఎవరైనా రైతులను మోసం చేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తరపున రైతులకు అండగా ఉంటామని మాటిచ్చారు. పత్తిని చివరి వరకు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి చర్చించారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌కి విజ్ఞాపనలు అందజేశారు కిషన్‌రెడ్డి. పత్తిలో తేమ 12 శాతం మించకుండా ఉండాలని సూచించారు. కాటన్ కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి మిగతా2లో...

## రూ.300కోట్ల దాల్ ట్రేడ్ కేసు

- తెలుగు రాష్ట్రాల్లో ఐటి సోదాలు




హైదరాబాద్,అక్టోబర్ 7: తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగా ణలోని 25 చోట్ల అధికారులు తనిఖీలు చేపట్టారు. రూ.300 కోట్ల దాల్ ట్రేడ్ కేసులో హైదరాబాద్, గుంటూరు, విజయ వాడ, కర్నూలు, విశాఖపట్నం ప్రాంతాలో మిగతా2లో...

## పొన్నం,అడ్లూరి

# మధ్య వ్యవహారం



- పరస్పర విమర్శలతో వేడెక్కిన రాజకీయం
- సమన్వయంతో కలసి ముందుకు వెళ్లాలన్న పిసిసి చీఫ్
- కాంగ్రెస్ అగ్రనేతలను కలిసి ఫిర్యాదు చేస్తానన్న అడ్లూరి

హైదరాబాద్,అక్టోబర్ 7: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. మంత్రి పొన్నం వ్యాఖ్యలపై తాజాగా, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందిస్తూ.. ఓ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవంగా ఉంటుంద న్నారు. మాదిగలు అంటే మీకు అంత చిన్న చూపా, అని సీరియస్ అయ్యారు. అన్న మాటను సమర్ధించుకుని ఇప్పటి వరకు రియాక్ట్ కాకుండా ఉన్నావంటే ఈ విషయం మిగతా2లో...




## నగరంలో బస్ ఛార్జీల పెంపు దారుణం

- 9న ఛలో బస్ భవన్‌కు బిఆర్ఎస్ పిలుపు

హైదరాబాద్,అక్టోబర్ 7: ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్కి పిలుపునిచ్చింది. ఛార్జీల పెంపు పేదలపై భారం పడుతందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఛలో బస్ భవన్ ధర్నాలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సహా.. మిగతా2లో...

## స్థానిక ఎన్నికల్లో పోటీకి

# మల్లన్న సిద్ధం

- పార్టీకి గుర్తు కేటయించాలని హైకోర్టులో పిటిషన్
- తగు చర్యలు తీసుకోవాలసి ఇసిని ఆదేశించిన హైకోర్టు




హైదరాబాద్,అక్టోబర్ 7: తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. బిసిలకు రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడ్డ ఈ పార్టీ రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ పార్టీ గుర్తింపు, పార్టీ గుర్తుపై హైకోర్టులో మల్లన్న పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పించాలని పిటిషనర్ నవీన్ కోరారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.కాగా.. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు, మిగతా2లో...



## హైకోర్టు తీర్పుకు లోబడే గ్రూప్-1 నియామకాలు

- స్టే ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,అక్టోబరు7: తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై అడ్డంకులు తొలిగాయి. దీనిపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఊరట లభించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. గ్రూప్-1 నియామకాలపై ఇటీవల హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా.. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిచడంపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ మిగతా2లో...

## ఎన్డీఎస్‌ఏ నివేదిక ప్రకారమే

# కాళేశ్వరం మరమ్మత్తులు

- తుమ్మడిహట్టిపై రెండు ప్రత్యామ్నాయాలు
- అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్



హైదరాబాద్,అక్టోబర్ 7:ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారమే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులు చేపడతాం అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.. డిజైన్లు రూపొందించేందుకు జాతీయ నైపుణ్య సంస్థల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం అని అన్నారు. శాస్త్రీయ పద్ధతిలో పారదర్శకంగా మరమ్మతులు చేపడతాం అన్నారు. తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తుమ్మిడి హట్టి విషయంలో రెండు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కాలువల విషయంలో ఈనెల 22 లోపు నిర్ణయం తీసుకుంటామన్నారు. మైలారం ద్వారా సుందిళ్లకు ఒక కాలువ ప్రతిపాదన, నేరుగా ఎల్లంపల్లికి నీటి తరలింపు ఇంకో ప్రతిపాదన ఉంది. వ్యయం, హైడ్రాలిక్, ఇంధనం, అన్నీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం అన్నారు. రెండు ప్రతిపాదనలపై ఇంజినీర్లు 2 వారాల్లోపు నివేదిక ఇవ్వాలని కోరాం. 2027 డిసెంబర్ నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేయాలన్నది మా లక్ష్యం. వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. డిండి ఎత్తిపోతలపై అధికారులు 3 రోజుల్లోగా నివేదిక అందించాలి‘ అని ఉత్తమ్ అన్నారు.

# బిసి రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

వినియోగిస్తోంది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరఫున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింగ్వి, సిద్దార్థ దవే లు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క, మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. ఈ క్రమంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింగ్వి తో ఫోన్ లో మాట్లాడారు. బుధవారం హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలో సింగ్విని కలసి ఇదే విషయమై విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని వారు కోరారు.

# రూ.300కోట్ల దాల్ ట్రేడ్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

సోదాలు కొనసాగుతున్నాయి. ఏపీలో గత ప్రభుత్వ హయాంలో పలు ట్రేడింగ్ కంపెనీలు భారీగా నగదు లావాదేవీలు జరిపినట్లు అధికారులు చెబుతున్నారు. 2024 ఎన్నికల సమయంలోనూ భారీగా నగదు విత్‌డ్రా చేసినట్లు ఐటీ శాఖ గుర్తించింది. పలు ట్రేడింగ్ కంపెనీలు పౌరసరఫరాల శాఖ నుంచి అనుమతులు పొంది పప్పు దినుసులు సరఫరా చేయకపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. విశాఖపట్నంలో హిందుస్థాన్ ట్రేడర్స్, కర్నూలుల వీకేర్ గ్రూప్‌లో సోదాలు జరిగాయి.

# నగరంలో బస్ ఛార్జీల పెంపు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ నేతలు పాల్గొంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. నందినగర్ నుంచి కేటీఆర్.. మెహిదీపట్నం నుంచి హరీశ్‌రావు బస్సులో ప్రయాణం చేసి బస్ భవన్‌కి చేరుకుంటారని చెప్పుకొచ్చారు తలసాని శ్రీనివాస్ యాదవ్. పెంచిన బస్సు చార్జీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అంటూనే.. వాళ్ల కుటుంబ సభ్యులపై భారం వేయడం అన్యాయమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కోల్పోయిన వారి సంఖ్యనే ఎక్కువని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా చెప్పిందని గుర్తుచేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్. గౌలిగూడ బస్ డిపోను రూ.400కోట్లకు ప్రైవేట్ వాళ్లకి ఇచ్చారని ఆరోపించారు. మియాపూర్, ఉప్పల్‌తో సహా.. వివిధ డిపోలను ప్రైవేటీకరణ చేయబోతున్నారని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసి కార్మికులను ముంచాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను స్వాగతిస్తున్నామని.. కానీ ఆర్టీసీ డ్రైవర్లతోనే ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాలు నడపడానికి ఆర్టీసీ ఉద్యోగులకు ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు.

# స్థానిక ఎన్నికల్లో పోటీకి మల్లన్న సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాధికారం లక్ష్యంగా ఇటీవల తెలంగాణ రాజ్యాధికార పార్టీని తీన్మార్ మల్లన్న స్థాపించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 17న తాజ్ కృష్ణ హోటల్‌లో పార్టీని స్థాపించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో రూపొందించారు. జెండా మధ్యలో పిడికిలి బిగించిన చేయితో పాటు కార్మిక చక్రం, వరి కంకులు ఉన్నాయి. జెండాపై భాగంలో ఆత్మగౌరవం, అధికారం, వాటా నినాదాలను రాశారు.

# హైకోర్టు తీర్పుకు లోబడే గ్రూప్-1 నియామకాలు

(మొదటి పేజీ తరువాయి)

జోయమాల్య బాగ్చిల ధర్మాసనం విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు ఇవ్వడంపైనా అభ్యర్థుల తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. వాదనల అనంతరం.. స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుకు సంబంధించిన ప్రధాన పిటిషన్లన్నీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఈనెల 15న విచారణకు రానున్న నేపథ్యంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈలోగా చేపట్టిన నియామకాలన్నీ.. రిట్ అప్పీల్స్‌పై ఇచ్చే ఫలితానికి లోబడి ఉంటాయని, హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పాటించాలని సుప్రీంకోర్టు సూచించింది. అవకాశం ఉన్నంత త్వరగా పిటిషన్లపై విచారణ ముగించి తగిన ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. ఈ కేసుకు ప్రాధాన్యత ఇచ్చి విచారణ పూర్తి చేయాలని సూచిస్తూ.. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణను ధర్మాసనం ముగించింది.

# కొమురం భీమ్ ఆశయ సాధనకు కృషి

- ఆదివాసీల అభివృద్ధితోనే ఇది సాధ్యం
- వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,అక్టోబర్ 7:** ఆదివాసీల అభివృద్ధితోనే కొమరం భీం ఆశయాలు నెరవేరుతాయని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు. ఆయన ఆశయాల కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఐటీడీఏ ఏర్పాటులోనూ కొమరం భీం స్ఫూర్తి ఉందన్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీం వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఆ మహనీయుడు విగ్రహానికి మంత్రి సీతక్క పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొమరం భీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని.. దానికి అనుగుణంగా ప్రత్యేక జీవో ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆ మహానాయకుడి వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కొమరం భీం పోరాటం.. ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటమని చెప్పుకొచ్చారు. మా గుడాల్లో మా రాజ్యం కావాలని మా అడవుల మీద మాకు హక్కు ఉండాలని పోరాటం చేశారని గుర్తు చేశారు. వారి పోరాటాల ఫలితంగానే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, తొలి ప్రధాని నెహ్రూ ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగంలో ప్రత్యేక రక్షణలు కల్పించారని తెలిపారు. కొమరం భీం స్ఫూర్తితో గిరిజన మంత్రిత్వ శాఖ ఏర్పాటు అయ్యిందని వెల్లడించారు. రాజ్యాంగంలో ఈశాన్య రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించారన్నారు. మైదాన ప్రాంత రాష్ట్రాల్లోని ఆదివాసీల పరిరక్షణ కోసం షెడ్యూల్ 5ను రాజ్యాంగంలో చేర్చారని చెప్పారు.

# పత్తి రైతులకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 122 సెంటర్లలో పత్తి కొనుగోలు జరుగుతోందని తెలిపారు. తేమశాతం కొలిచే మిషన్లు కొనుగోలు కేంద్రాల్లో ఉంటాయని వెల్లడించారు. రైతులకు అండగా 122 సెంటర్లలోని కమిటీలు ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర జోలి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ని తాను కలిశానని తెలిపారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలను వివరించానని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం పత్తి కొనుగోలు ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. తెలంగాణలో మౌలిక వసతులు పెంచాలని సూచించారు. కాటన్ ఉత్పత్తి కేంద్రాలు పెంచాలని దిశానిర్దేశర చేశారు. మహారాష్ట్ర కోలలో హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు చేయడం లేదని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తనను అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. రైతుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. పత్తిలో తేమశాతం తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సూచించారు కిషన్‌రెడ్డి.రైతుల్లో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన తీసుకురావాలని కోరారు. అందరూ ఒకేసారి పత్తిని జిన్నింగ్ మిల్స్‌కి తీసుకురావడంతో పంట కొనుగోలు చేయడంలో ఇబ్బంది ఏర్పడుతోందని వివరించారు. ఆన్‌లైన్‌లో ముందస్తుగానే పత్తిని ఏరోజు తీసుకువస్తారనేది రిజిస్టర్ చేసుకుంటే సమస్య ఉండదని చెప్పుకొచ్చారు. సీసీఐ నుంచి నేరుగా రైతుల ఖాతాకు డబ్బు వెళ్తుందని స్పష్టం చేశారు. ఇతర దేశాల్లో కాటన్ రేటు తక్కువగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ నిధులని పత్తిలో తేమ తగ్గించేందుకు రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయాలని సూచించారు. మహారాష్ట్ర అకోలాలో హై డెన్సిటీ ఎలాంటేషన్ ద్వారా ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం పెరుగుతోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు.

# పొన్నం,అడ్లూరి మధ్య వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

నీ విజ్ఞతకే వదిలేస్తున్నాను అని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. సహచర మంత్రిని, ఎస్సీ సామాజిక వర్గం నేతను ఆ మాట అంటుంటే చూస్తూ ఉంటావా అని మంత్రి వివేక్ వెంకటస్వామిని మంత్రి లక్ష్మణ్ కుమార్ నిలదీశారు. ఇక, మంత్రి పొన్నం ప్రభాకర్- అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎపిసోడ్ పై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ రంగ ప్రవేశం చేశారు. ఇద్దరు మంత్రులకు ఫోన్ చేసి ఇరువురు సంయమనం పాటించాలని చెప్పినట్లు సమాచారం. అడ్లూరినీ ఉద్దేశించి పొన్నం కామెంట్స్ చేశారని ప్రచారం.. అడ్లూరిని ఉద్దేశించి మాట్లాడలేదని పొన్నం వివరణ ఇచ్చారు. పొన్నం కామెంట్స్‌ని తప్పు పట్టిన మంత్రి శ్రీధర్ బాబు.. పార్టీకి, ప్రభుత్వానికి ఇది మంచిది కాదంటూ శ్రీధర్ బాబు హితవు పలికారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మనస్పర్థలపై పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ స్పందించారు. ఈ మేరకు మీడియం సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మహేష్ గౌడ్ ఫోన్ చేశారు. ఇద్దరు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలని మహేష్ గౌడ్ సూచించారు. పొన్నం ప్రభాకర్ లాగా అహంకారంగా మాట్లాడటం తనకురాదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. మంత్రి వివేక్ లాగా తన దగ్గర డబ్బులు లేవని స్పష్టం చేశారు. తాను మంత్రి కావడం, ఆ సామాజిక వర్గంలో పుట్టడం తన తప్పా.. అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో సోనియా, రాహుల్, ఖర్గే, మీనాక్షిని కలుస్తానని వివరించారు. తాను కుర్చీలో కూర్చుంటే వివేక్ లేచి వెళ్లిపోతున్నారని చెప్పారు. తాను పక్కన ఉంటే వివేక్ ఓర్చుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం తాను ఆదిలాబాద్ పర్యటనలో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే కాంగ్రెస్ నేతలను కలుస్తానని అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే మంత్రి పదవి వచ్చిందని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. నేను మంత్రి కావడం.. మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. అయితే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై తాను స్పందించనని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. పీసీసీ అధ్యక్షుడు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్. రహ్మత్‌నగర్ భేటీలో ఏం జరిగిందో ఆయనకు వివరించా. అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పార్టీ పరంగా మాకు మహేశ్ గౌడ్ ఆదేశాలు శిరోధార్యం అని అన్నారు.

# ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుదాం

- ప్రజలకు మంత్రి తుమ్మల సూచన



**ఖమ్మం,అక్టోబర్7:** ఖమ్మం నగరాన్ని అందంగా తీర్చి దిదద్దడంతో పాటు, పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యమని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం పట్టణం గతంలో చిన్న పంచాయతీగా ఉండేది, కేవలం 4 వేల జనాభా మాత్రమే ఉండేవాళ్లు అన్నారు. ఇక, మీ డివిజన్లను మీరే పరిశుభ్రంగా ఉంచుకోవాలి, డివిజన్ కు కావలసిన మౌలిక సదుపాయాలు కమిషనర్ అభిషేక్ అగస్త్యను సంప్రదించండి అని సూచించారు. మన కార్పొరేషన్ ను చూసి ఇతర ప్రాంతాలు నేర్చుకునేలా ఉండాలి అన్నారు. నగరం ప్రశాంతమైన వాతావరణం ఉండాలి, కక్ష్యలకు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలని మంత్రి తుమ్మల కోరారు. అయితే, ఉన్నత మైన చదువులు చదివితే ఆ కుటుంబం పేదరికాన్ని వీడుతుంది అని మంత్రి నాగేశ్వరరావు తెలిపారు. నగర వాసులకు హైదరాబాద్, అమెరికా కంటే మంచి చదువు ఖమ్మం నగరానికి వస్తుంది అని భరోసా ఇచ్చారు. పోలీసులకు సూచించా పార్టీల పరంగా పోలీసులు ఎవరి పైనా కేసులు పెట్టొద్దని.. అలాగే, రోడ్ల వెడల్పు కోసం నాయకుల ఇండ్ల అయినా కొంత తీసుకోక తప్పదు అన్నారు. బైపాస్ రోడ్డు వేసినప్పుడు నన్ను తిట్టుకున్నారు, ఇప్పుడు బైపాస్ రోడ్డు కూడా జామ్ అవుతుంది.. ఇంకా రెండు మూడు వందల కోట్ల రూపాయలు సీఎం రేవంత్ రెడ్డినీ అడిగి తీసుకుని వస్తాను.. గుడిసెల్లో బ్రతికే పేదలకు ఇళ్లు ఇచ్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. పేదలకు మంచి చేసే విధంగా రాజకీయం ఉండాలి, ఇబ్బంది పెట్టే విధంగా ఉండకూడదని తుమ్మల వెల్లడించారు.

# ఆర్టీసీ ఛార్జీల పెంపు దారుణం

- ప్రజలపై భారం మోపడమేనన్న కెటిఆర్

**హైదరాబాద్,అక్టోబర్ 7:** తెలంగాణలో ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుపై రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ప్రభుత్వం చార్జీలు పెంచడం అన్యాయం అని ఆయన విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోందని, కానీ అదే సమయంలో పురుషులు, విద్యార్థులపై అదనపు భారాన్ని మోపుతోందని కేటీఆర్ మండిపడ్డారు. ఇంట్లో ఒక మహిళ ఉచితంగా ప్రయాణం చేస్తే, కుటుంబంలోని మిగిలిన సభ్యులందరికీ రెండింతలు చార్జీలు కట్టాల్సి వస్తోంది. దీంతో ఒక కుటుంబానికి నెలకు కనీసం ఇరవై రూపాయల వరకు అదనపు భారం పడుతోంది. ఈ విషయం ఇప్పుడు ప్రతి తెలంగాణ కుటుంబానికీ అర్థమైందని ఆయన అన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే పథకం ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రారంభించినట్టు ప్రభుత్వం చెబుతుందేమో కానీ, వాస్తవానికి ఇది ఆర్థిక సమతుల్యతను దెబ్బతీసే నిర్ణయమని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ ఇప్పటికే ఆర్థికంగా కష్టాల్లో ఉన్న సమయంలో ఈ విధంగా వసూళ్లను పెంచడం ప్రజలపై నేరుగా భారం మోపడం అవుతుందని ఆయన అన్నారు. ఆర్టీసీని బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉన్నా, అది ప్రజల వెన్నుపైన భారం మోపడం ద్వారా సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తన ఆర్థిక లోటును పూడ్చుకునేందుకు ప్రయాణికులను బలితీసుకుంటోందని ఆయన ఆరోపించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం మానేసి, ప్రచారపరమైన పథకాల పేరుతో బడ్జెట్ నష్టాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ప్రజలతో మోసం చేయడమేనని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కూడా ఈ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, చార్జీల పెంపును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల జీవన వ్యయాలు ఇప్పటికే పెరిగిపోయాయని, ఇలాంటి చర్యలు సాధారణ కుటుంబాలపై మరింత భారం మోపుతాయని వారు పేర్కొన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలతో ఆర్టీసీ చార్జీల పెంపు అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చావిషయంగా మారింది.



# పిసి ఘోష్ కమిషన్‌పై విచారణ

- 12వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు



**హైదరాబాద్,అక్టోబర్ 7:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకొని చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టకూడదని కేసీఆర్, హరీశ్ తమ పిటిషన్లలో వాదించారు. ఆ నివేదికను పూర్తిగా రాజకీయ ఉద్దేశ్యాలతో రూపొందించారని, దాని ఆధారంగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా సరైంది కాదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా ఆదేశించింది. కమిషన్ తరఫున లాయర్ నిరంజన్ రెడ్డి ఈ విచారణ సందర్భంగా కౌంటర్ అఫిడవిట్ సమర్పించకపోవడంపై క్షమాపణలు కోరారు. కొన్ని వివరాలు సేకరించడంలో ఆలస్యం జరిగిందని, త్వరలోనే సమగ్రమైన కౌంటర్ సమర్పిస్తామని కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆయన వివరణను అంగీకరించి, తదుపరి విచారణ తేదీని నిర్ణయించింది. ఇక ఇదే కేసులో మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా హైకోర్టు

# చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ పై దాడి

**- రాజ్యాంగంపై దాడి అని ఖండన.**
**-కళ్లకు నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన**
**తిప్పారపు సురేష్**
**- కే వి పి ఎస్ జిల్లా కార్యదర్శి**
**గజ్జెల శ్రీకాంత్**
**- ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి.**







చర్చ :- కరీంనగర్
సిజెఐపై దాడిని ఖండించడానికి మాటలు సరిపోవని కెవిపిఎస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. ఆయనపైనే దాడి కాదు, రాజ్యాంగంపై జరిగిన దాడి అని, తీవ్రమైన ఆగ్రహం, బాధతో గవాయి కి సంఘీభావంగా దేశమంతా నిలవాలని కోరారు. కరీంనగర్ లోని తెలంగాణ చౌకు వద్ద కళ్లకు నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం దాడి బుద్ధిహీనుల చర్య అని సమాజాన్ని ద్వేషం, మతోన్మాదం ఎలా ముంచెత్తాయో చూపిస్తుందని విమర్శించారు. స్వతంత్ర న్యాయవ్యవస్థపై బహిరంగ దాడి జరిగిందని అన్నారు. దీనిని వికృత మనస్తత్వం కలిగిన వ్యక్తి చేసిన చర్యగా పరిగణించలేమని, దేశంలో న్యాయ వ్యవస్థ, దాని స్వతంత్రత, న్యాయ సమీక్ష శక్తి, లౌకికవాద భావనపై కొన్ని వర్గాల నుండి వ్యవస్థీకృతమైన, దుర్మార్గపు దుర్భాషలతో ప్రచారంలో భాగంగా దీనిని చూడాలని అన్నారు. ఇది దేశ మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురిచేస్తుందని, దేశంలో "నాథురామ్ మనసు" పథాన్ని గుర్తు చేస్తుందని విమర్శించారు. దీనిని సహించలేమని, సమాజంలోని అన్ని వర్గాలు, ముఖ్యంగా న్యాయ సోదరభావం తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇది న్యాయ వ్యవస్థపైనే కాకుండా రాజ్యాంగంపై కూడా జరిగిన దాడి అని పేర్కొన్నారు. ఈ ఘటనను క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని, నిందితుడు, తన వెనుక ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఖండిస్తూ నిరసనలు తెలపాలని కోరారు. దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత సనాతన ధర్మం పేరుతో మనుధర్మం పేరుతో దాడులు హత్యలు దౌర్జన్యాలు అన్ని వర్గాల ప్రజలపై మేధావులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. చీఫ్ జస్టిస్ పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భీమ్ ఆర్మీ తెలంగాణ చీఫ్ వాసాల శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పై, న్యాయవ్యవస్థపై బీజేపీ ఆర్ ఎస్ ఎస్ చేస్తున్న కుట్రల లో భాగమే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, వినయ్ సాగర్ నగర కార్యదర్శి , కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపల్లి సాగర్, నగర కార్యదర్శి గాజుల కనకరాజ్, నాయకులు కాదాసీ కుమార్, బొమ్మల సాగర్, అజయ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మం, సత్యం, ఆదర్శ విలువలను బోధించిన రుషి వాల్మీకి మహర్షి అని కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ అన్నారు.



చర్చ :- కరీంనగర్ కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం రోజు సంస్కృత, సాహిత్యంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ మహారుషి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది ఆయన చిత్ర పటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ మాట్లాడుతూ... సంస్కృతం, సాహిత్యం ఆదికవిగా పిలువబడే మహారుషి వాల్మీకి జయంతి వేడుకలు కార్యాలయంలో నిర్వహించడం చాలా సంతోషకరం అన్నారు. రామాయణ మహాకావ్యం రచించి ప్రపంచానికి ధర్మం, న్యాయం, సత్యం, సేవా మార్గాలను చూపించిన గొప్ప మహనీయులని అన్నారు. ప్రతి ఒక్కరికి వాల్మీకి మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ సువార్త, డిప్యూటీ కమీషనర్లు వేణు మాధవ్, ఖాదర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమీషనర్ దిలీప్ రెడ్డి, ఎస్ఈ రాజ్ కుమార్, పలు విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బంధువుల నుండి చట్టబద్ధమైన దత్తత



చర్చ :- కరీంనగర్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన పిల్లలు లేని దంపతులు వారి రక్తసంబంధీకుల నుండి చట్టబద్ధమైన దత్తత తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి దత్తత ఉత్తర్వులను దత్తత తల్లిదండ్రులకు అందజేశారు .కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ దత్తత కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత మాత్రమే తీసుకోవాలని అన్నారు. బంధువులు, రక్తసంబంధీకుల నుండి దత్తత తీసుకోదలిస్తే జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, కరీంనగర్ లో సంప్రదించాలన్నారు. ఈ జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, శిశుగృహ మేనేజర్ తేజస్విని, ఎల్.సి.పి.ఓ రాజు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**- ఎన్నికల విధుల పట్ల సంపూర్ణ అవగాహన కలిగించేలా శిక్షణ కార్యక్రమాలు**
**-నామినేషన్ల స్వీకరణ కు మండలాల్లో పటిష్ఠ ఏర్పాట్లు**
**- స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**





చర్చ:- కరీంనగర్. పెద్దపల్లి జిల్లా
నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి పాల్గొన్నారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల సంబంధించి నామినేషన్ స్వీకరణ కు మండల కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో అవసరమైన మేర కౌంటర్ లు ఏర్పాటు చేసి సంబంధిత ఎంపిటిసి స్థానాలకు నామినేషన్లు స్వీకరించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు ఎన్నికల నిర్వహణలో సంపూర్ణ మద్దతు ఎంపీడీఓ, ఎంపీఓలకు అందించాలని అన్నారు. ప్రతి మండలం ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన మేర అధికారులు నియామకం పూర్తి చేయాలని అన్నారు.ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండేలా పటిష్ట శిక్షణ అందించాలని అన్నారు. నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన, వారికి గుర్తుల కేటాయింపు తదితర అంశాల పై పూర్తి శిక్షణ అందించాలని అన్నారు. మండలాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సంపూర్ణ సామాగ్రి అందించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు అందరికీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సర్వీస్ ఓటర్లకు, పీడి యాక్ట్ కింద అరెస్టైన వారికి, ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేయడం జరుగుతుందని, మన ఓటర్ జాబితా పరిధిలో పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాల్సిన వారి పేర్లు రౌండాఫ్ చేసుకోవాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలు, ఓటర్ జాబితా వివరాలు సంబంధిత పోటీ చేసే అభ్యర్థులకు సమాచారం అందించాలని అన్నారు. నామినేషన్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ర్యాలీ , ప్రచారాలు అనుమతి లేవని, అభ్యర్థి తో పాటు 3 మాత్రమే అనుమతించడం జరుగుతుందని అన్నారు.ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారానికి అనుమతి మంజూరు చేయాలని, సౌండ్ సెట్, వాహానానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలని, ఎక్కడ కూడా పోటీదారుల కు ఒకే రూట్ లో సమావేశాలు ర్యాలీలో నిర్వహణకు అనుమతి జారీ చేయవద్దని అన్నారు.ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందు కు అక్రమంగా నగదు మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల ఓట్ల కోసం కుల,మత విద్వేశాలు రెచ్చగొట్టకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. అధికారులు ఎన్నికల విధులను తమకు కేటాయించిన బుక్ లెట్ లోని నిబంధనల ప్రకారం పటిష్ఠంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, డిపిఓ వీర బుచ్చయ్య,పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల గారు చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా ఆశాలతో మరియు వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనైనది.

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత**






చర్చ :- కరీంనగర్.రాజన్న సిరిసిల్ల: ఈ సమీక్ష సమావేశంలో ఆశాల రికార్డులు పరిశీలించి ఇంటింటి సర్వే ద్వారా గర్భిణీ స్త్రీలను గుర్తించి, రిజిస్ట్రేషన్ చేయించడం, గర్భిణీ స్త్రీలను చెకప్ చేయించి ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాల కొరకు ప్రోత్సహించడం, దీర్ఘకాల వ్యాధుల బీపీ, షుగర్ మరియు క్యాన్సర్ సంబంధిత వ్యాధుల తో బాధపడే వారిని గుర్తించి నమోదు చేసుకోవడం తో పాటు చికిత్స చేయించా వలసిందిగా, (టీబి తో) దగ్గు,తెమడ రెండు వారాలకు మించి ఉన్న వారిని గుర్తించి తేమడా పరీక్షలు చేయించి చికిత్స అందించాల్సిందిగా, విష జ్వరాలతో బాధపడేవారు గుర్తించి రక్త పరీక్షలు చేయించవలసిందిగా ఆషాడే సందర్భముగా ఆశలకు మరియు వైద్య సిబ్బందికి దిశా నిర్దేశం చేసినారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంజలినా ఆల్ఫ్రెడ్,డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనిత, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి గార్లు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి - అదనపు కలెక్టర్ డి.వేణు



చర్చ :- కరీంనగర్. పెద్దపల్లి జిల్లా
మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు.మహాకవి వాల్మీకి జయంతి పురస్కరించుకొని మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు పాల్గొన్నారు. మహాకవి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ, మహాకవి వాల్మీకి హైందవ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని, రామాయణ గ్రంథం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు మహాకవి వాల్మీకి రచించిన రామాయణం కారణంగానే మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వసుదైక కుటుంబం అనే భావన రామాయణంతో ముడిబడి ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. మహాకావ్యం రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి జయంతిని పండగగా జరుపుకోవడం సంతోషకరమని అదనపు కలెక్టర్ తెలిపారు. అనంతరం వక్తలు మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి , కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



చర్చ :- కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో పాటు ఉన్నతా ధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదర్శమైన రామాయణం రచించిన వాల్మీకి సత్యం, ధర్మం, న్యాయం, సేవా వంటి విలువలను సమాజానికి చాటి చెప్పారని అన్నారు. సంస్కృత సాహిత్యంలో అయన సేవను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, డీఆర్ఓ బి.వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఏవో సుధాకర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళిక ప్రకారం రాజన్న ఆలయ విస్తరణ పనులు పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఎం. హరిత**
**- వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష**
**- భీమేశ్వర ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన**
**-వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం విస్తరణ, అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు.**





చర్చ :- కరీంనగర్. రాజన్న సిరిసిల్ల
ముందుగా శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని కలెక్టర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం కళ్యాణ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు కలెక్టర్ కు ఆశీర్వచనం చేశారు. వారికి ఆలయ ఈఓ రమాదేవి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న కట్టడాల కూల్చివేత పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం విస్తరణ, అభివృద్ధిపై ఆలయ అతిథి గృహంలో వీటీఏడీఏ, ఆలయ అధికారులు, అర్చకులు, ఆర్ %డ% బీ, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆలయ విస్తరణ, అభివృద్ధిపై రూపొందించిన నమూనాను కలెక్టర్ కు క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి విపులంగా వివరించారు. ప్రస్తుతం ఉన్న భవనాల కూల్చివేత పనులు, ప్రణాళిక ప్రకారం చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. హరిత మాట్లాడారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులకు వీటీఏడీఏ ఆద్వర్యంలో శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఆలయ విస్తరణకు పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రోజూ వారీగా చేపట్టే పనుల వివరాలు ఇవ్వాలని సూచించారు. నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్ కు ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రతి రోజూ ముఖ్యమేనని, ఒక్కరోజు కూడా వృథా చేయకుండా పనులు కొనసాగించాలని తెలిపారు.వచ్చే మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరకు ముందు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెలలో శృంగేరి పీఠాధిపతులు రానున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

**- భీమేశ్వర ఆలయంలో క్షేత్ర స్థాయిలో పరిశీలన**

భీమేశ్వర ఆలయంలో భక్తుల సౌకర్యార్థం అభిషేకం, అన్న పూజ, కోడె క్యూలైన్లో, కౌంటర్స్, ప్రసాదం తయారీ విభాగం ,నిత్య కళ్యాణము, సత్యనారాయణ వ్రతం మండపంతోపాటు పలు ప్రదేశాలను ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో ఆర్%డ%బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి, ఆర్%డ%బీ ఈఈ నరసింహ చారి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, వీటీఏడీఏ సెక్రటరీ అన్సార్, ఆలయ అర్చకులు, అధికారులు, దితరులు పాల్గొన్నారు.

## నాగభూషణం ప్రధమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న రావుల శేషగిరి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 7(చర్చ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం , బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి బాబాయ్ రావుల నాగభూషణం ప్రధమ వర్ధంతి కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడం జరిగింది.

# బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులుగా వీరవెల్లి రాజేష్ గుప్తా

**- స్థానిక ఎన్నికల్లో బిజెపి సత్తా చాటుతాం**



**చర్చ, ఖమ్మం:**భారతీయ జనతా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆ పార్టీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్త పేర్కొన్నారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షునిగా తనను నియమించిన పార్టీ అధినాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు తనకు పార్టీ జిల్లా ఉపాధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించడం గొప్ప అవకాశం అని, ఈ ఎన్నికల్లో బిజేపీ సత్తా ఎంటో చూపించాల్సిన ఆవశ్యకత కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తనతోపాటు మిగితా కార్యవర్గంపై ఉందన్నారు. తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షునిగా నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సహాయ మంత్రి బండి సంజయ్, జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, రాష్ట్ర నాయకులు సన్నే ఉదయ్ ప్రతాప్, శీలం పాపారావు, వాకధాని పుల్లారావుతోపాటు ఇతర అదినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన శక్తి మేరకు పార్టీ పటిష్టతకు, స్థానిక ఎన్నికల్లో బిజెపి గెలుపుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# డీఎస్పీ పార్థివదేహానికి నివాళు లర్పించిన ఎస్పీ రోహిత్‌రాజు



**చర్చ, జూలూరుపాడు:**గుండెపోటుతో మరణించిన డిఎస్పీ విష్ణుమూర్తి పార్థివ దేహాన్ని మంగళవారం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. జూలూరుపాడులోని విష్ణు మూర్తి స్వగృహానికి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన మృతిపట్ల ప్రగాఢ, సానుభూతి తెలిపారు. ఎస్పీ వెంట పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# వాహనాలకు నెంబర్ ప్లేట్లు తప్పనిసరి

**- ఎస్సై రామారావు**



**చర్చ, వైరా:**వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉండాలని వైరా ఎస్సై పుష్పాల రామారావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనానికి ముందు, వెనక తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ వేయించి, దానిపై వాహన నెంబరు తప్పకుండా ఉండేలా చూడాలన్నారు. అలా కాకుండా నెంబర్ ప్లేట్‌పై వాహన నెంబర్ కనిపించకుండా పేర్లు రాస్తే అలాంటి వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒక వాహనానికి ఆ బండి నెంబర్ ప్లేట్ చాలా ముఖ్యమని, కానీ ఇటీవల కాలంలో కొందరు నెంబర్ ప్లేట్లపై నెంబర్ లేకుండా పేర్లు రాస్తున్నారని, అలా రాయటం వాహన నిబంధన ప్రకారం చట్ట విరుద్ధమని తెలిపారు. అదేవిధంగా వాహనానికి మించిన సైలెన్సర్లు పెట్టి శబ్దాలు చేయొద్దని సూచించారు. ఎవరైనా వెళ్లేటప్పుడు అతి వేగంగా డ్రైవింగ్ చేస్తూ సైలెన్సర్ శబ్దాలు చేస్తే అలాంటి వారి వివరాలను, బండి నెంబర్‌ను పోలీసులకు అందించాలని ఎస్సై రామారావు సూచించారు.

# చీకటి ధర్మయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించిన మంత్రి తుమ్మల



**చర్చ, సత్తుపల్లి:**సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు రోడ్డుకు చెందిన చీకటి ధర్మయ్య సంవత్సరికం సందర్భంగా వారి కుటుంబాన్ని మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా చీకటి ధర్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి తుమ్మల వెంట సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, పైడి వెంకటేశ్వరరావు, కొల్లి వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తుమ్మల అభిమానులు ఉన్నారు

# మానవత్వం, సత్యం, ధర్మం విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన మహర్షి వాల్మీ గారు : పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ ఐపిఎస్

**చర్చ :- కరీంనగర్. రామగుండం**

రామగుండం పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలోమహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ , పోలీస్ అధికారులు మహర్షి వాల్మీకి గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్బంగా సీపీ మాట్లాడు తూ.ప్రపంచం ఉన్నంత వరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుందని సీపీ గారు అన్నారు. మహర్షి వాల్మీకి రచించిన రామాయణం సత్యం, నీతి, ధర్మం, కర్తవ్యబోధలను మనకు బోధించిన అమృత గ్రంథం. ఆయన బోధనలు సమాజంలో సత్యం, న్యాయం, సమానత్వం స్థాపనకు ప్రేరణగా నిలుస్తాయి. మానవత్వం, సత్యం, ధర్మం విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన మహర్షి వాల్మీ అన్నారుఈకార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, ఐపిఎస్., అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్,



ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏ ఓ శ్రీనివాస్ ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం, సూపరిండెంట్స్ ఇంద్రసేనారెడ్డి, సందీప్




కుమార్, సిసి హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా ఆటో డ్రైవర్లు ఆదర్శంగా నిలవాలి

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




**చర్చ :- కరీంనగర్** మహిళా ఆటో డ్రైవర్లు ఆర్థిక సాధికారత సాధించి తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్



పమేలా సత్పతి అన్నారు.దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా, శిశు వికాస కేంద్రంలో ఎలక్ట్రిక్ ఆటో డ్రైవింగ్ లో శిక్షణ పొంది ఉపాధి పొందుతున్న మహిళలతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు విభిన్న రంగాలలో రాణించాలని, స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక సాధికారత సాధించాలన్న ఉద్దేశంతో ఆటో డ్రైవింగ్ లో ఉచిత శిక్షణ ఇచ్చామని అన్నారు. అంతేకాకుండా వారికి ఉచితంగా ఆటోలు



అందజేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళా ఆటో డ్రైవర్లు ఉపాధి పొందాలని పేర్కొన్నారు. ఆటోలను కుటుంబ సభ్యులకు, ఇతరులు ఎవరికీ ఇవ్వరాదని అన్నారు. ఆటోలు కేటాయించిన మహిళలే నడుపుతూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ సమావే శంలో మహిళా ప్రాంగణం మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

# సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి పై దాడిని ఖండించండి.

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.**

**హైదరాబాద్, అక్టోబర్ 7(చర్చ):**

దేశ అత్యున్నత మైన న్యాయస్థానం సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి పై దాడి చెయ్యడానికి సిద్ధపడటం సారి కాదని దాన్ని సనాతనం తో ముడిపెట్టడం దివాలు కోరుకుంటూ రాజకీయమని వెంటనే అతనిని నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్ట్ చెయ్యాలని కోరుతూ నేడు సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ హమాలీ అడ్డా వద్ద నిరసన కార్యక్రమం చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనాతన దర్మం పేరిట హింసను ప్రోత్సహిస్తే సనాతన దర్మం కూడా ఒప్పుకోదని, సనాతన దర్మం పేరిట దాడులు, చంపడా లు,బెదిరింపులు బీజేపీ అధికారంలోకి వచ్చాక పెరిగా యాని, సనాతన దర్మం పేరుతో రాజకీయాలు చేస్తే ప్రజలు ఒప్పుకుం



టారని భావిస్తే అది తప్పుడు ఉద్దేశ్యమని కావున సనాతన ధర్మం పేరిట దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. హిందూ మతానికి తప్పుడు అర్థం ఇచ్చిన చిన్నజీయర్ ను ఏమనలేదని ఎందుకంటె అయిన బ్రాహ్మణుడని,అదే బ్రాహ్మణుడు పై ఇలాంటి దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం కఠినమైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఇది న్యాయమూర్తి పై జరిగిన దాడి కాదని రాజ్యాంగం పై,బావ వ్యక్తికరణ పై జరిగిన దాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్,కార్యవర్గ సభ్యులు నర్సింహారెడ్డి, సిపిఐ నాయకులు శ్రీనివాస్,దేవేందర్, ప్రవీణ్,బాలయ్య, కిష్టయ్య,నాగేశ్వర్,శ్రీనివాసులు,జంబూ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల కారణంగా మిషన్ భగీరథ ఆగిపోయిన త్రాగునీటిని గ్రామాల పరిశీలించిన

**- నల్గొండజిల్లా కలెక్టర్ త్రిపాటి**



**చర్చ ప్రతినిధి నల్గొండ జిల్లా..**

ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా దేవరకొండ డివిజన్, డిండి మండలం, కందుకూరు వాగులో మిషన్ భగీరథ పైప్ లైన్లు దెబ్బతినగా నీటి సరఫరా నిలిచిపోయిన గ్రామాలకు ప్రత్యామ్నాయ పద్ధతిలో ట్యాంకర్లు, బోర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం ఆమె కందుకూరు వాగులో దెబ్బతిన్న మిషన్ భగీరథ పైప్ లైన్ స్థలాన్ని పరిశీలించారు. మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా అధికారులతో సమస్యను అడిగి తెలుసుకున్నారు. చందంపేట, దిండి మండలాలలోని 92 గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్ లైన్ భారీ వర్షాల కారణంగా



దెబ్బతిన్నదని , అందువల్ల చందంపేట, డిండి మండలాలలోని గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పైపులైన్లను పునరుద్ధరిస్తామని మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ జిల్లా కలెక్టర్ కు వివరించారు. వాగులో వరద నీరు తగ్గిన వెంటనే పైప్ లైన్లను పునరుద్ధరించాలని, అప్పటివరకు ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా తాగునీటి ట్యాంకర్లు, బోర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని దేవరకొండ ఆర్డిఓ ను ఆదేశించారు. పైప్ లైన్ ల మరమ్మతు, పునరుద్ధరణకు తీసుకునే సమయం, పై నుండి నీటి ప్రవాహం, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ డిండి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరికృష్ణతో ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులు, సీజనల్ వ్యాధులు, ఓపి, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నా రు.ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు తప్పనిసరిగా వారి పరిధిలోని పాఠశాలలను, అంగన్వాడి కేంద్రాలను సందర్శించి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు వైద్య ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది తక్కువగా ఉన్నారని, సిబ్బందిని కేటాయించాలని డాక్టర్ హరికృష్ణ జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం చుట్టుపక్కల ఉన్న ముళ్ళపొదలు, చెట్లను తొలగించాలని ఎంపీడీవోను,తహసీల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు . ఈ సందర్భంగా కలెక్టర్ పేషెంట్లతో మాట్లాడుతూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ ఐటిఐ ని సందర్శించి భవన నిర్మాణం, ఫ్లోరింగ్ పరిశీలించారు. లీకేజీలు కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. దేవరకొండ ఆర్ డి ఓరమణారెడ్డి, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు లక్ష్మీనారాయణ,మహమ్మద్ అక్తర్,నగేష్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులు గెలిపే లక్ష్యంగా పనిచేయాలి

**- చుంచుపల్లి,లక్ష్మీదేవి పల్లి, సుజాతనగర్ మండలాల్లో పర్యటించిన కాంగ్రెస్ నేతలు**

**- ఆశావాహుల నుంచి దరఖాస్తుల స్వీకరించిన నేతలు**

**- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కోనేరు చిన్ని**

**కొత్తగూడెం, అక్టోబర్ 7( చర్చ ):** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయ కులు కోనేరు సత్యనారాయణ( చిన్ని) పిలుపునిచ్చారు. మంగళ వారం కొత్తగూడెం నియోజకవర్గంలోని చుంచుపల్లి,లక్ష్మీదేవి పల్లి మండలాల్లోని గ్రామాల్లో పర్యటించారు.సర్పంచులు, వార్డు మెంబర్లు,ఎంపీటీసీలు,జడ్పిటిసి స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల



నుంచి దరఖాస్తులు తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా కోనేరు సత్యనారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి అగ్రస్థానంలో నిలవాలని పిలుపునిచ్చారు. తాము స్వీకరించిన దరఖాస్తులను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అది నాయకత్వానికి అందజేయడం జరుగుతుందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, పదవుల కోసం ఆశించకుండా పార్టీ అభ్యర్థులు గెలుపు కోసం పని చేయాలన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నాయకుడు,కార్యకర్త గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వివరించారు.

# రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

**- నార్నె శ్రీనివాస రావు**



**హైదరాబాద్, అక్టోబర్ 7( చర్చ ):** హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి శాతవాహన కాలనీ బస్ స్టాప్ వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గుంటలు పడిందని సమాచారం మేరకు, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులను పిలిపించి, రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను దగ్గరుండి పరిశీలించిన కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గుంటలు పడిందని, దీని వలన వాహనదారులు కింద పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనికాలనీ అసోసియేషన్ వారి సమాచారం మేరకు రోడ్డు ప్యాచ్ పనులు చేపట్టామని చెప్పడం, అలానే, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు మరియు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో డివిజన్ లో అత్యవసరం ఉన్న చోట, నిత్యం సమస్యలతో ఉన్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని నార్నె శ్రీనివాసరావు తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని నార్నె శ్రీనివాసరావు పేర్కొన్నారు. అలానే అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని నార్నె శ్రీనివాసరావు తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, అదే విధంగా హైదర్ నగర్ డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్గా తీర్చిదితామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, దేవి వారి సిబ్బంది, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పాలస్తీనా ప్రజలకు అండగా ఉందాం

**- ఇజ్రాయిల్ దాడులను ఆపి వేయాలి**
**- ఆకుల పాపయ్య జిల్లా కార్యదర్శి**
**- సిపిఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ**




**చర్చ : నిజామాబాద్** గాజా పై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్న జాతి హననానికి వ్యతిరేకిద్దాం. గాజా ప్రజలకు సంఘీభావాన్ని తెలుపుదాం అంటూ మంగళ వారం నిజామాబాద్ నగరంలోనీ %×ఖీఖ% ద్వారక నగర్ కార్యాలయం నుండి వీక్లీ బజార్ చౌరస్తా వరకు న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య గారు మాట్లాడుతూ ఇజ్రాయిల్ మారణ హోమం వలన ఆరు వేలకు పైగా (6000) గాజా ప్రజలను పొట్టన పెట్టుకున్నారని అన్నారు. దాంట్లో ముక్కుపచ్చలు ఆరని చిన్న పిల్లలను సైతం చంపుతున్నారని, తినడానికి తిండి, త్రాగడానికి నీరు లేకుండా నరహంతక అమెరికా తో చేతులు కలిపి మానవ హననానికి పాల్పడుతోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు గాజా ప్రజలకు ఓడల ద్వారా ఆహారాన్ని అందించడానికి వెళ్తే వాటిని కూడా బాంబుల ద్వారా ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. ఈ విధ్వంసాన్ని ఆపడానికి భారత్ ఇజ్రాయిల్ పై ఒత్తిడి తీసుకురావాలి అన్నారు.పాలస్తీనా, గాజా లలో ఉన్న చమురు నిక్షేపాలను చేజిక్కించుకునీ ప్రపంచ దేశాలపై ఆదిపత్యం చేయించడానికి అమెరికా పడుతున్న కుట్ర అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య, నీలం సాయిబాబా, జేపీ గంగాధర్, మోహన్, భారతి, బి నర్సయ్య, శివ కుమార్, సాయినాథ్, టి భాస్కర్, శంకర్ ల పాల్గొన్నారు

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు


**శేర్లింగంపల్లి, అక్టోబర్ 7 (చర్చ):** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీ లో వాల్మీకి బోయ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచానికి పరమ పవిత్రమైన రామాయణాని వరంగా ఇచ్చిన ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ , సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని పూల మాల వేసి ఘన నివాళు లర్పించిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని , వాల్మీకి జయంతి ని పర్గత్ దివస్ అని కూడా పిలుస్తారు వాల్మీకి మహర్షి గొప్ప వ్యక్తి అని, సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగల కవి అని, రామాయణాన్ని వ్రాశాడు అని,ఈయన్ని సంస్కృతభాషకు ఆదికవిగా గుర్తిస్తారు. ఇతడే శ్లోకమనే ప్రక్రియను కనుగొన్నాడు. ప్రచేతసుని పుత్రుడు కాబట్టి అతడు ప్రాచేతసుడు అని కూడా ప్రసిద్ధం అని గాంధీ తెలియచేశారు. వాల్మీక రామాయణంగా అందరికీ తెలిసిన వాల్మీకంలో 23వేల శ్లోకాలు 7 కాండాలుగా (ఉత్తరకాండ సహా)విభజించబడి ఉన్నాయి. రామాయణంలో 4 లక్షల ఎనభై వేల పదాలు ఉన్నాయి. ఇది మహాభారత కావ్యంలో దాదాపుగా పావు వంతు భాగం అని, రామాయణం భారతీయ వ్మాయంలో ఆదికావ్య ంగాను, దానిని సంస్కృతంలో రచించిన వాల్మీకి మహాముని ఆదికవిగాను సుప్రసిద్ధం అని, గొప్ప కవి అని , ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శం అని, స్ఫూర్తిదాయకం అని గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# సుప్రీంకోర్టు సీజేఐ గవాయ్‌పై దాడి ప్రజాస్వామ్య మనుగడకే ముప్పు

**- మతోన్మాద శక్తుల దుష్టకృత్యంపై: టీపీసీసీ రాష్ట్ర**
**ట మాజీ అధికార ప్రతినిధి డి. వై. గిరి ఖండన**



**హైదరాబాద్, అక్టోబర్ 6 (ప్రత్యేక ప్రతినిధి):** భారత రాజ్యాంగ విలువలను అవమానపరిచే ఘోర సంఘటనగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డి. వై. గిరి తీవ్రంగా ఖండించారు.సనాతన హిందూ ధర్మం పేరుతో ఒక మతోన్మాది అడ్వకేట్, సుప్రీంకోర్టు ప్రాంగణంలోనే సీజేఐ గవాయ్‌పై పాదరక్ష విసరడం అత్యంత దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం వ్యక్తిగత దాడి కాకుండా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ పునాదులపై జరిగిన దాడిగా ఆయన పేర్కొన్నారు."హిందూ మతోన్మాదులే వెనుక ఉన్నారు"ఈ ఘటన వెనుక హిందూ మతోన్మాద శక్తుల హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. సంఘ్ పరివార్ ఆశ్రయంతో బీజేపీ వీరిని పెంచిపోషిస్తోందని, సనాతన ధర్మాన్ని తామే కాపాడుతున్నామని చెప్పుకునే వీరు, రాజ్యాంగ విలువలను త్రొక్కేస్తున్నారని. ఇది దేశ ప్రజలకు సిగ్గుపడే విషయమన్నారు."గవాయ్‌పై దాడి అంటే రాజ్యాంగంపైనే దాడి"సీజేఐ గవాయ్ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్న న్యాయవేత్త. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తున్న ఆయనపై మతోన్మాదుల దాడి దళితులు, వెనుకబడిన వర్గాలపై ఉన్న ద్వేషానికి ప్రతీక. దేశ ప్రజాస్వామ్య పునాదులను కాపాడే ప్రతి భారత పౌరుడు దీనిపై స్పందించాలని గిరి పిలుపునిచ్చారు.రాష్ట్రపతి, ప్రధాని, హోం మంత్రి స్పందించాలిఈ ఘటనపై రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, హోం మంత్రి తక్షణమే స్పందించాలని డి. వై. గిరి డిమాండ్ చేశారు."ఇది దేశ న్యాయవ్యవస్థను అవమానపరిచిన ఘోర ఘటన. నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి కఠిన శిక్ష విధించాలి," అని అన్నారు. తాను ఈ ఘటనపై భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, హోం మంత్రికి ఈ-మెయిల్ ద్వారా విజ్ఞప్తి పంపినట్లు ఆయన తెలిపారు.మతోన్మాద శక్తుల కుట్రకు ప్రజలు అప్రమత్తం కావాలిదేశంలో మను ధర్మాన్ని తిరిగి స్థాపించాలన్న కాషాయ శక్తుల కుట్ర కొనసాగుతోంది. చాతుర్వర్ణ వ్యవస్థను బలపరచే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ఇది కొత్త భారత్ కాదు ు పాత మను రాజ్యం! రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు ఐక్యంగా నిలవాలి," అని డి. వై. గిరి పిలుపునిచ్చారు.డి. వై. గిరిటీపీసీసీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ ు హైదరాబాద్

# మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**చర్చ, సత్తుపల్లి:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించి, వెంటే పెండింగ్ బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు మధ్యాహ్నం భోజన కార్మికుల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మెట్టుపల్లి సత్యవతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదినారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, రావలసిన బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల వేతనం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కోడిగుడ్లు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, మెనూ ఛార్జి పెంచి ఒక్కొక్కరికి రూ.25 ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం రానున్న కాలంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్.కె రంజాన్ బి, మండల అధ్యక్షులు మిట్టపల్లి సత్యవతి, సాదు సూరమ్మ, లోక వెంకటేశ్వరరావు, పిల్లి బుజ్జాలు, సీత మహాలక్ష్మి, వేరే ఎంకమ్మ, అబ్బులమ్మ, రాగిణి, పార్వతి, శివ, వెంకటేశ్వరరావు, కృష్ణ ఎస్కే లాల్, మహమ్మద్ హమీద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగట్టాలి

**- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు**




**చర్చ, మణుగూరు:** అమలు కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కినటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక సంస్థల్లో ఓట్లు అడగడం కోసం ఇంటికి వస్తే నిలదీయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. మంగళవారం మణుగూరులోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో చేసిన మోసాలు చాలవన్నట్లు మళ్లీ మరొకసారి మోసం చేయడానికి కాంగ్రెస్ నాయకులు వస్తున్నారన్నారు. వారు ఏ మొహం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడగడానికి వస్తారని, ఈసారి ప్రజలు మోసపోరని, వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. యూరియా కొరతతో రైతన్నల ఆశలు అడియాశలు అయ్యాయని అన్నారు. యూరియా కొరత ఏర్పడటంతో రైతులు వేసినటువంటి వివిధ రకాల పంటల్లో దిగుబడి క్షీణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి మనమందరం ఎప్పటిలాగే ఒక తాటిపై నడిచి ప్రజలకు చేరువై ప్రజలను ఈ అసమర్ధ కాంగ్రెస్ పార్టీ నుండి కాపాడి వారికి తగిన బుద్ధి వచ్చేలా చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కుంట లక్ష్మణ్, పార్టీ నాయకులు ఎడ్ల శ్రీను, వట్టం రాంబాబు, ఆడప అప్పారావు, యూసఫ్ షరీఫ్, యాదగిరి గౌడ్, ప్రభుదాస్, అక్కి నరసింహారావు, వేల్పుల సురేష్, గువ్వ రాంబాబు, మాజీ ప్రజా ప్రతినిధులు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.?

# విధులు బహిష్కరించిన న్యాయవాదులు




**చర్చ, సత్తుపల్లి:** ఢిల్లీలో భారత అత్యున్నత న్యాయస్థానంలో చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన అమానుష దాడి సంఘటనను నిరసిస్తూ మంగళవారం సత్తుపల్లి కోర్టు నందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్వచ్ఛందంగా విధులను బహిష్కరించారు. ఇలాంటి అమానుష సంఘటనలు పునరావృతం కాకూడదని, అట్టి చర్యలకు పాల్పడిన వారికి చట్టపరంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, కఠిన శిక్షలు విధించాలని న్యాయవాదులందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పోరాడే సిపిఎం అభ్యర్ధులను గెలిపించండి

**- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్**



**చర్చ, సత్తుపల్లి:** స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను స్థానిక సంస్థలు ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ కోరారు. సత్తుపల్లి మండలం తాళ్లమడ గ్రామంలో పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ సీనియర్ నాయకులు బాల బుచ్చయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతరం ప్రజలు, రైతుల కోసం కార్మికుల పట్ల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హక్కుల కోసం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్మికులు, రైతాంగం పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై నిత్యం ప్రజల తరఫున పోరాడుతున్నామని అన్నారు. మండలంలో సింగరేణి, బుగ్గ పాడు ఫుడ్ పార్క్, సీతారామ ప్రాజెక్ట్, నేషనల్ హైవే భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలని పోరాటం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు అయినంపూడి సనందరావు, కావూరి వెంకటేశ్వరరావు, సాదు పున్నమయ్య, కొలికి పోగు జగపతిరావు, కొర్స వెంకమ్మ, మంచాల కన్నయ్య, బొప్పన వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.?

# కొమరం భీమ్‌కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే జారె



**చర్చ, అశ్వారావుపేట:** ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కొమరం భీమ్ అని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. కొమరం భీమ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం గండుగులపల్లి క్యాంప్ ఆఫీస్ వద్ద ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా జారె మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ నినాదంతో నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాడి ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన పోరాటం అణగారిన వర్గాల స్వయంపాలన స్వాభిమానం కోసం సాగిన చరిత్రాత్మక ఉద్యమ మని, ఆయన చూపిన ధైర్యం, త్యాగం నేటి తరానికి స్ఫూర్తి అన్నారు. కొమరం భీమ్ వర్ధంతి కేవలం సంస్మరణ దినంగా కాకుండా గిరిజనుల హక్కుల పరిరక్షణకు పునరంకితం కావాల్సిన రోజుగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. కొమరం భీమ్ ఆశయాల సాధనలో భాగంగా ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు.

బుధవారం,
అక్టోబర్ 08, 2025

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక



# పల్లవికి ఘన సన్మానం



**చర్చ, ఖమ్మం:** ఏఐ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచి ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న తాళ్లూరు పల్లవిని ఆర్‌ఎంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. మంగళవారం ప్రధాన ఉపాధ్యాయులు ఆమంచి సత్యనారాయణ అధ్యక్షతన డాక్టర్ కడవెండి వేణుగోపాల్ ఎకో క్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్, ఉషోదయ విద్యాసంస్థల అధినేత వివి లక్ష్మినారాయణ, రిటైర్డ్ డైటీషియన్ పి. కృష్ణమూర్తి , రిటైర్డ్ టీచర్ వై.మధుసూదన్ రావు, జెడ్‌పిటిసి మోహన్ రావు, పాపులర్ ఛానల్ అధినేత సాదిక్, తాళ్లూరి రవి ప్రసాద్‌లు ఆమెను శాలువలతో ఘనంగా సన్మానించి వెంకటేశ్వర స్వామి చిత్రపటాని బహుకరించారు. ఈ సందర్భంగా కడవెండి వేణుగోపాల్ పర్యావరణం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తూ తాళ్లూరి పల్లవిని అభినందిస్తూ విద్యార్థులకు స్ఫూర్తి గలిగే విధంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సతీష్, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**చర్చ, ఖమ్మం:** మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదికవి శ్రీమహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాకవి వాల్మీకి ఆధ్యాత్మికవేత్తగా రామాయణ కావ్యం రచించి ఆదికవిగా వెలుగొందారని, రామాయణం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని అన్నారు. ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు. అనంతరం వక్తలు మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు, కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


## ఓబీ కంపెనీలలో పూర్తిస్థాయి రక్షణ సూత్రాలు అమలు చేయాలి




**చర్చ, మణుగూరు:** సింగరేణి మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న ఓబీ కంపెనీలలో పూర్తిస్థాయి రక్షణ సూత్రాలు అమలు చేయాలని, ఫిట్నెస్ అయిన యంత్రాలను మాత్రమే నడిపేలా చూడాలని సామాజిక సేవకులు కర్నె బాబురావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఏరియా సేఫ్టీ ఆఫీసర్ డి. వెంకట రామారావుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ మల్లెపల్లి ఓసిలో ఇటీవల మట్టి వెలికితీత పనుల కాంట్రాక్ట్ పొందిన గౌరవ్ ఓబి కంపెనీ పూర్తిస్థాయి కండిషన్ లో ఉన్న భారీ యంత్రాలను ప్రవేశపెట్టాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా సర్వేడ్ ఆఫ్ అయిన యంత్రాలను, మరమ్మతులకు వచ్చిన యంత్రాలను ప్రవేశపెట్టి వాటికి ఎలాంటి ఫిట్నెస్ లేకుండా క్వారీలో నడుపుతున్నారని, ఫలితంగా అట్టి యంత్రాలు క్వారీలో ఎక్కడ పడితే అక్కడే ఆగిపోతున్నాయని ఆరోపించారు. ఈ అంశంపై యాజమాన్యం రక్షణ విభాగం ఆధ్వర్యంలో తనిఖీలు చేయాలని కోరారు.

## పట్టుదలతో చదవి అనుకున్న లక్ష్యాన్నిసాధించాలి

**- జిల్లా అడిషినల్ డి.సి.పి బి.రామానుజం**



**చర్చ, ఖమ్మం:** పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని జిల్లా అడిషినల్ డిసిపి (ఆడ్మీన్) బి.రామానుజం ఆకాంక్షించారు. మంగళవారం ఆయన ఛాంబర్‌లో స్థానిక బురహాన్‌పురంకు చెంది చెన్నైలో ఇంజనీరింగ్ విద్య చదువుతున్న నిరుపేద విద్యార్థి పండింట్ జయంత్ బహుదూర్‌కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ అందించిన రూ.20 వేల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నతస్థాయికి ఎదగాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. తండ్రికి క్యాన్సర్ వ్యాధి సోకడంతో ఆర్థికంగా చితికిపోయి ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ విద్యను మధ్యలో నిలిపివేయాల్సిన పరిస్థితి ఉత్పన్నం కావడంతో ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ కొనసాగింపునకు జయంత్‌కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య మానవతాద్రక్పథంతో ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని అన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్య, పోలీస్ శాఖ రిటైర్డ్ ఏవో, జిల్లా పెన్షనర్ల ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు జీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ ని కలిసిన ఇనుగుర్తి ఎస్సై కరుణాకర్



**చర్చ,ఇనుగుర్తి,మహబూబాబాద్:** ఇనుగుర్తి నూతన పోలీస్ స్టేషన్ కు తొలి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన గంగారపు కరుణాకర్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ను మంగళవార జిల్లా కేంద్రం మహబూబాబాద్ లోని ఎస్పీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై కరుణాకర్ మాట్లాడుతూ..బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

# అన్న నగర్ నిలబెట్టింది గోపన్ననే!

**- సునితమ్మ గెలుపుతో జూబ్లీహిల్స్ లో మళ్లీ గులాబీ జెండా ఎగురాలి**

**- బోరబండ డివిజన్ ఇంచార్జ్, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్.**









**మేడ్చల్ అక్టోబర్ 7( చర్చ ):** జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్లో అన్నా నగర్ లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, బిఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధికి గోపీనాథ్ చేసిన సేవలను ప్రజలు స్మరించుకున్నారు. అదేవిధంగా మరోమారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలను నయవంచన చేసేందుకు ప్రచారం పేరుతో తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులకు “బాకీ కార్డు” చూపించి ఆరు గ్యారంటీల అమలుపై నిలదీయాలన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ...”అన్నా నగర్” బస్తీని నిలబెట్టింది గోపన్ననే.సునితమ్మ గెలుపుతో జూబ్లీహిల్స్ లో మళ్లీ గులాబీ జెండా ఎగురాలన్నారు. 2023 శాసనసభ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ, మరో మారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో అభివృద్ధి జపం పటిస్తూ మరో మారు ప్రజలను నయవంచనకు గురి చేస్తుందని, కాంగ్రెస్ నాయకుల దొంగ మాటలను ప్రజలు నమ్మవద్దని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండి సునితమ్మ గెలిపించుకున్నప్పుడే నియోజకవర్గం లోని ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాగంటి గోపీనాథ్ కుమారుడు మాగంటి వాత్సల్యనాథ్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు క్రిష్ణ మోహన్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు విజయ్ కుమార్, వసంత రావు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గేను పరామర్శించిన మంత్రి పొంగులేటి

**- ఇందిరమ్మ ఇండ్లపై ఆరా తీసిన ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే**



**చర్చ, ఖమ్మం:** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు వివరించారు. ఇటీవల అనారోగ్యానికి గురై బెంగుళూరులో విశ్రాంతి తీసుకుంటున్న ఖర్గేను పొంగులేటి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు, చెల్లింపులు, లబ్దిదారుల ఎంపిక విధానం, ఒక్కో ఇంటికి యూనిట్ కాస్ట్ తదితర అంశాలపై ఖర్గే మంత్రి పొంగులేటిని అడిగి తెలుసుకున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే పేదలకు రూ. లక్షలతో ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే సదుపాయాన్ని కల్పించినట్లు చెప్పారు. ఇండ్ల పథకాలలో కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయని, కానీ తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూ. 5 లక్షలతో 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఇండ్లను లబ్దిదారుడే నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించామని మంత్రి వివరించారు. ఇంటి నిర్మాణ దశలను బట్టి లబ్దిదారులకు ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులను జమ చేస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా లబ్దిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని, పేదరికమే అర్హతగా ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరుతెన్నులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించగా ఖర్గే స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు బాగుందని, ఇదే విధంగా ముందుకు సాగాలని మంత్రి పొంగులేటిని అభినందించారు

# సి.జె.ఐ పై దాడిని ఖండిస్తూ విద్యార్థి సంఘాల నిరసన

**- జెకె కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థి సంఘాల ఆగ్రహ దినం**

**- పి.డి.ఎస్.యు -ఎస్.ఎఫ్.ఐ పి.డి.ఏస్.యు సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం**



**చర్చ,భద్రాద్రి కొత్తగూడెం:** దేశ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. జెకె కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద పి.డి.ఎస్.యు, ఎస్.ఎఫ్.ఐ, పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి బి. అభిమన్యు, పి.డి.ఏస్.యు జిల్లా కార్యదర్శి డి. ప్రణయ్, జిల్లా నాయకులు వి. విజయ్, జె. గణేష్ మాట్లాడుతూ “సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో న్యాయమూర్తి జస్టిస్ గవాయి పై లాయర్ రాకేష్ కిషోర్ చెప్పు విసరడం రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన చర్య,” అని పేర్కొన్నారు. వారు మరింతగా మాట్లాడుతూ “కొన్ని మతతత్వ శక్తులు రాజ్యాంగాన్ని అణగదొక్కి మనుస్మృతి పాలనను తీసుకురావాలని చూస్తున్నాయి. జస్టిస్ గవాయి పై దాడి కూడా అదే దిశగా సాగుతున్న మతోన్మాద ధోరణికి నిదర్శనం,” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. లాయర్ రాకేష్ కిషోర్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి మతోన్మాద దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు కిషన్, అరుణ్, ప్రవీణ్, శివ, పి.డి.ఎస్.యు నాయకులు వెంకటేష్, సతీష్, విక్రమ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థపై మతోన్మాదుల దాడిని కండించాలి

**సిజెఐ గవాయ్ దాడి ఘటన న్యాయవావస్థను దెబ్బతీసే కుట్ర**

**దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి**

**సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య**

**సిపిఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన**




**చర్చ,భద్రాద్రి కొత్తగూడెం :** భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై మతోన్మాద ముసుగులో ఉన్న న్యాయవాది జరిపిన దాడి ప్రజాస్వామ్య పునాదులపై జరిగిన దాడి అని, ఈ దాడిని భారతీయ సమాజం ముక్తకంఠంతో కండించాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ న్యాయస్థానంలో జరిగిన దాడిని నిరసిస్తూ సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పోస్టాఫీసు సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, న్యాయవ్యవస్థకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేశ న్యాయవ్యవస్థకు ప్రతీక అని, ఆయనపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్య పునాదులపై దాడి చేయడమేనని, ఇలాంటి సంఘటనలు న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీస్తాయని అన్నారు. ప్రభుత్వం తక్షణం దాడి వెనుక ఉన్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం చెప్పే గొంతుకలను బెదిరించడం, దాడులకు పాల్పడటం సరైది కాదని, న్యాయవాదులకు, న్యాయమూర్తులకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని, జరిగిన సంఘటనపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో గనిగళ్ల వీరాస్వామి, వాసిరెడ్డి మురళి, జిల్లా సమితి సభ్యులు కె రత్నకుమారి, గౌనె మని, నాయకులు మర్రి గోపి, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, షహీన్, పుట్టి భాగ్యలక్ష్మి, కైసర్, కత్తెర రాములు, కె ధర్మరాజు, గౌనె సురేష్, గుత్తుల శ్రీనివాస్, బాదావత్ రంజీ, మండల రాజు పాల్గొన్నారు.

# జెడ్పీటిసి టికెట్ కోసం బిజెపి నాయకుల దరఖాస్తు





**చర్చ,నెల్లికుదురు:** బిజెపి నుంచి నెల్లికుదురు జడ్పీటిసి కోసం పోటీ చేయడానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు నెల్లికుదురుకు చెందిన చందు రాజకుమార్ యాదవ్,నైనాల గ్రామస్తుడు పార్టీ మండల నాయకులు తోట రమేష్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు కు మంగ ళవారం దరఖాస్తులు అందజేశారు. రాజ్ కుమార్ మాట్లాడుతూ తాను 15 సంవత్సరాలుగా ఏపీవీపీ,బిజెపి బలోపేతానికి కృషి చేస్తున్నట్లు,2 ధర్మలు బిజెపి అధ్యక్షునిగా కొనసాగుతున్నట్లు తెలిపారు.తోట రమేష్ మాట్లాడుతూ తాను 5 సం.లుగా నైనాల బూత్ అధ్యక్షునిగా,పార్టీ మండల మాజీ ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా మండల నేతలు నేత రామచంద్ర రావు గారు ధర్మారెడ్డి,చీకటి మహేష్ గౌడ్,గూగు లోతు మదన్లాల్,గడ్డం అశోక్,సందీప్, సంతోష్,కుక్కల ఐలయ్య,వంగాల రామచంద్రు,వేల్పుల సందీప్,రొయ్యల చంటి,తోట సురేష్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా లో వేమన శతకం

**సృజన పుస్తకాలు అందజేతు- అయ్య దేవర శేషగిరిరావు!**





**చర్చ, సత్తుపల్లి:** అమెరికాలోని తెలుగు కుటుంబాల వారు తమ పిల్లలకు మాతృ భాషను బోధించే క్రమంలో వేమన శతక పద్యాలను కూడా నేర్పుతున్నారు.సత్తుపల్లి పట్టణానికి చెందిన అయ్యదేవర శేషగిరిరావు, మాదిరాజు మాలతి దంపతులు సోమవారం అమెరికా టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ పట్టణం నందుగల కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో సృజన సాహితీ సమాఖ్య పంపిన వేమన శతక పద్య పుస్తకాలను అందచేసారు.శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి స్థాపించిన ఈ దేవాలయంలో తెలుగు కుటుంబాల పిల్లలకు 'బాలదత్త' కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ప్రతి ఆదివారం బాల రామాయణం,బాల భారతం వంటి పురాణాల తోపాటు మాతృభాషను కూడా నేర్పుతున్నారు. ఇందులో భాగంగా మాతృభాషకు సంబంధించిన వేమన శతకం తోపాటు బాల సాహితీవేత్త వురిమళ్ళ సునంద రాసిన తెలుగు భాషా వాచకాలను స్వచ్ఛంద శిక్షకులు దీప్తి,శరణ్యలకు అందచేసారు.విద్యార్థులకు మాతృభాషా బోధనకు ఈ పుస్తకాలను ఈ సంవత్సరం నుండి ఉపయోగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పుస్తకాలను పంపిన సృజన సాహితీ సమాఖ్య,వురిమళ్ళ సునంద లకు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో సాయి ప్రకాష్ కౌశిక్,తెలుగు కుటుంబాల వారు పాల్గొన్నారు.

# సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి**



**చర్చ :- కరీంనగర్**

స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా నోడల్ అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు కేటాయించబడిన అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, మ్యాన్ పవర్, బ్యాలెట్ బాక్సెస్, రవాణా, శిక్షణ, సామాగ్రి నిర్వహణ, ఖర్చుల పరిశీలన, పరిశీలకులు, బ్యాలెట్ పేపర్ -పోస్టల్ బ్యాలెట్, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్ లైన్, ఫిర్యాదులు-పరిష్కారాలు, ఓటర్ స్లిప్పుల పంపిణీ, నివేదికలు, వెబ్ కాస్టింగ్, ఫలితాల పర్యవేక్షణ అంశాలకు సంబంధించి నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. ఈ విధులు కేటాయించబడిన అధికారులు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎలాంటి పొరపాట్లకూ తావు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని, అటువంటి వారిపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఇప్పటికే శిక్షణలో పూర్తి చేసామని, ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్స్ ల కొరత లేదని తెలిపారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగేలా సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు

# కరీంనగర్ సీపీ కార్యాలయంలో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు





**చర్చ :- కరీంనగర్**శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని, కరీంనగర్ పోలీసు కమీషనరేట్ కార్యాలయంలో ఈ రోజు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా, అడిషనల్ డీసీపీ శ్రీ వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక నివాళు లర్పించారు.అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి కేవలం కవి మాత్రమే కాదని, ఆయన ఒక యుగ పురుషుడని కొనియాడారు. ఆయన రచించిన 'రామాయణం' సత్యం, నీతి, ధర్మం, కర్తవ్యం వంటి మానవ విలువలకు అద్దం పడుతుందని తెలిపారు. సమాజంలో సత్యం, న్యాయం, సమానత్వం స్థాపనకు వాల్మీకి ఆశయాలే మనకు మార్గదర్శకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్ కుమార్, కమీషనరేట్ కార్యాలయ అధికారులు, సూపరింటెండెంట్ లు మరియు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొని మహర్షి వాల్మీకికి నివాళులర్పించారు.

# ఏటీసీ కేంద్రాల పనుల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**- రుద్రంపూర్, మణుగూరులో సాంకేతిక మౌలిక సదుపాయాల నిర్మాణం వేగవంతం చేయాలని సూచనలు**





**చర్చ,భద్రాద్రి కొత్తగూడెం :**
జిల్లాలోని అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. రుద్రంపూర్ మరియు మణుగూరు కేంద్రాలను సందర్శించిన ఆయన, సంబంధిత శాఖల అధికారుల నుండి నిర్మాణ స్థితి, ల్యాబ్ ఏర్పాట్లు, పరికరాల సరఫరా, శిక్షణా సదుపాయాల ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటీసీ కేంద్రాలు విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇలాంటి సెంటర్ల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి అని తెలిపారు.అలాగే ఆయన పేర్కొంటూ సాంకేతిక శిక్షణ పొందిన యువత తక్షణ ఉద్యోగ అవకాశాలు పొందగలుగుతారు. ఈ కేంద్రాలు స్థానిక పరిశ్రమల అభివృద్ధికి కూడా దోహదపడతాయి అని అన్నారు.రుద్రంపూర్ ఏటీసీ కేంద్రంలో నిర్మాణ పనులు, ల్యాబ్ పరికరాల ఏర్పాటు, శిక్షణ సదుపాయాల ఏర్పాట్ల పురోగతిని సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, మణుగూరులో కంప్యూటర్ మరియు సిమ్యులేషన్ ల్యాబ్‌లు, పరికరాల సరఫరా ప్రణాళికలను సమీక్షించారు.కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఉద్దేశించి పనులు వేగవంతం చేయాలని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఆలస్యాలు లేకుండా సమన్వయంతో ముందుకు సాగి, అవసరమైన సవరణలు తక్షణమే చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో రామవరం ఐటీఐ ప్రిన్సిపల్ రమేష్, మణుగూరు ఐటీఐ ప్రిన్సిపల్ ప్రభాకర్, మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి హితోక్తులు పాటిస్తే ఉత్తమ పురుషులవుతారు

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**ఆదికవి వాల్మీకి మహర్షి చెప్పిన హితోక్తులు పాటిస్తే దేశ జనబంధువులంతా ఉత్తమ పురుషులవుతారని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణ మహా కావ్యాన్ని అందరూ చదివి అర్థం చేసుకుని, నియమాలను ఆచరిస్తూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొదుమూరి సత్యనారాయణ, ముదురుకోళ్ల కిషోర్, వల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకన్న, బి. నందకిషోర్, మురికి శ్రీనివాస్, కె. సాంబయ్య, గుమలాపురం సత్యనారాయణ, బోయ సంఘం నాయకులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఆర్టీసీకి ఒక్కరోజే ఆదాయం రూ.37,95,470

**- సత్తుపల్లి ఆర్టీసీ డీఎం ఊటుకూరి సునీత!**





**చర్చ, సత్తుపల్లి:**దసరా పర్వదినం సందర్భంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి డిపోకు ఒక్కరోజు 6వ తేది సోమవారం నాడు రూ.37,95,470 ఆదాయం వచ్చిందని డీఎం ఊటుకూరి సునీత తెలిపారు. గతంలో రాఖీ రోజు రూ.32లక్షలు, గతేడాది దసరా రోజు రూ.34లక్షలు ఆదాయం రాగా ఈసారి అధిగమించామని చెప్పారు. 20 అదనపు సర్వీసులను నడిపించామని, ఆరోజు 1.6ఆక్యూపెన్సీ రేషియో సాధించామని, అదేవిధంగా 67.80 ఈ పి కే సాధించినట్లు పేర్కొన్నారు. 55,977కిలోమీటర్లు మేర బస్సులు రాకపోకలు సాగించామన్నారు. ఇదంతా డిపో ఉద్యోగులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేయడంతోనే సాధ్యమైందని, అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో గేట్ వద్ద ఉద్యోగుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్.సాహితీ, ఏడీసీలు, సూపర్ వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# గవాయిపై దాడి చేసిన వారిపై దేశద్రోహం కేసు పెట్టాలి



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** భారత దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై షూ విసిరి ఆయనపై దాడికి పాల్పడిన వ్యక్తిపై దేశ ద్రోహం కేసు పెట్టాలని వక్తలు డిమాండ్ చేశారు.బహుజన సంఘాల కన్వీనర్ తాండ్ర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొత్తగూడెం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్భంగా హాజరైన వక్తలు మాట్లాడుతూ జస్టిస్ గవాయి పై జరిగిన దాడి భారతదేశ 140 కోట్ల మంది ప్రజలపై , భారత రాజ్యాంగంపై దాడి అని కావాలని ప్రధాన న్యాయమూర్తి పై దాడికి కుట్రచేశారని ఒకవేళ ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో పౌర సమాజం ఏకధాటి పైకి వచ్చి రాజ్యాంగాన్ని రాజ్యాంగ శక్తులను రక్షించుకుంటామని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బాలశౌరి,జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుసపాటి శ్రీనివాస్ టిఎంఆర్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్ కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు లోగాని శ్రీనివాస్ సింగరేణి ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి అంతోటినాగేశ్వరరావు, ఐ ఎల్ పి ఏ అధ్యక్షులు గోపికృష్ణ పౌర హక్కుల సంఘం నాయకులు ఉపేందర్ మారుపాక రమేష్ సాదిక్ పాషా అడ్వకేట్లు భానుప్రియ షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పూల రవీందర్ న్యూ డెమోక్రసీ జిల్లా సెక్రెటరీ గౌని నాగేశ్వరరావు ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి సంజీవ్ బీసీ నాయకులు బండి రాజు గౌడ్ ప్రభాకర్ అంకినీడు ప్రసాద్ మహిళా నాయకులు మేదిని లక్ష్మి,దంసలపూడి భాస్కర్,బామ్ సేఫ్ నాయకులు సాగర్,బండి పల్లి కిరణ్,శివ,కొప్పుల రమేష్,సురేందర్ తదితరులు పాల్గొన్నారు

# భద్రాద్రి జిల్లా విద్యార్థుల సత్తా

**- రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక**



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం**ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టేబుల్ టెన్నిస్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈనెల 6న నిర్వహించిన పోటీలలో అద్భుత ఆటతీరు, క్రమశిక్షణ, కృషితో మెరుగైన ప్రదర్శన చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం.విద్యార్థుల ఈ విజయంతో జిల్లా క్రీడా రంగం ఉత్సాహభరితంగా మారింది. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో వీరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి పరంధామ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అదే ఉత్సాహం, క్రమశిక్షణతో పాల్గొని జిల్లాకు గౌరవం తీసుకురావాలి" అని అభినందించారు.కోచ్ షేక్ గయాసుద్దీన్ (రియాజ్)కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ నరేష్, సీనియర్స్ బట్టు ప్రేమ్ కుమార్, శ్రీనివాస్, థామస్, రాంబాబు, పిఈటి శ్యామ్, రవితో పాటు తల్లిదండ్రులు కూడా విద్యార్థులను అభినందించారు.

# ఎన్నికల నియమావళిని ఉల్లంఘించవద్దు

**- రిటర్నింగ్ ఆఫీసర్ మురళి.**





**చర్చ,ఇనుగుర్తి:** ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించవద్దని రిటర్నింగ్ ఆఫీసర్ మురళి రాజకీయ పార్టీలకు సూచించారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తహసిల్దార్ తరంగిణి,ఎఫ్ఎసి ఎంపీడీవో పార్థసారథి,ఏవో భూక్య మహేందర్,పి ఆర్ ఏ ఈ విద్యాసాగర్,నెల్లికుదురు ఏఎస్ఐ వెంకటరెడ్డి లతో కలిసి వివిధ పార్టీల పొలిటికల్ లీడర్స్, పంచాయతీ కార్యదర్శుల తో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన స్థానిక ఎన్నికల నిబంధనల పై పై అవగాహన కల్పించారు. జడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికలు ఇనుగుర్తి మండలం లో ఫేజ్-2 టు నామినేషన్స్ ఈనెల 13 నుంచి మొదలవుతాయని ఈ మేరకు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు.కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు కూరెల్లి సతీష్,బైరు అశోక్ గౌడ్, దార్ల రామ్మూర్తి, కొట్టం రాము,పింగిలి శ్రీనివాస్ తదితర నాయకులతోపాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పార్టీ గుర్తింపుపై హైకోర్టును ఆశ్రయించిన తీన్మార్ మల్లన్న



**హైదరాబాద్, అక్టోబర్ 7:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) తెలంగాణ హైకోర్టును ఆశ్రయిం చారు. రాజకీయ పార్టీ గుర్తింపు, గుర్తుపై హైకోర్టులో మల్లన్న పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పించాలని పిటిషనర్ నవీన్ కోరారు. ఈ పిటిషన్‌పై (మంగ ళవారం) హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.కాగా.. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు, రాజ్యాధికారం లక్ష్యంగా ఇటీవల తెలంగాణ రాజ్యాధికార పార్టీని తీన్మార్ మల్లన్న స్థాపించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 17న తాజ్ కృష్ణ హోటల్‌లో పార్టీని స్థాపించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో రూపొందించారు. జెండా మధ్యలో పిడికిలి బిగించిన చేయితో పాటు కార్మిక చక్రం, వరి కంకులు ఉన్నాయి. జెండాపై భాగంలో ఆత్మగౌరవం, అధికారం, వాటా నినాదాలను రాశారు. పిడికిలి కింది భాగంలో పార్టీ పేరును ముద్రించారు.అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని న్యాయస్థానాన్ని మల్లన్న కోరడం.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో. మల్లన్నకుఎన్నికల సంఘం ఎలాంటి గుర్తును కేటాయిస్తుందో చూడాలి మరి.

# కాంగ్రెస్ ధోకా కార్డుపై బీఆర్ఎస్ నేతల రియాక్షన్




**హనుమకొండ, అక్టోబర్ 7:** కాంగ్రెస్ ధోకా కార్డు విడుదలపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలుతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాకీ కార్డుకు సమాధానం చెప్పలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. (మంగళవారం) మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయ్ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ. హైడ్రా పేరుతో ఇళ్లను కూల్చివేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు యూరియా దొరకడం లేదని తాము నిరసనలు చేస్తుంటే... కాళేశ్వరం రిపోర్టు తెరపైకి తెచ్చారని విమర్శిం చారు. కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొడతామని స్పష్టం చేశారు. ప్రజలకు ఉన్న బాకీ కార్డుతో గుర్తు చేస్తే... ధోకా కార్డును తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. అమలు కానీ హామీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని వినయ్ భాస్కర్ ఆరోపణలు గుప్పించారు.ప్రజలకు ధోకా చేసిందే కాంగ్రెస్: రాజయ్యపులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు కాంగ్రెస్ ధోకా కార్డు విడుదల చేసిందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య వ్యాఖ్యలు చేశారు. అలవికానీ హామీలు ఇచ్చి ప్రజలకు అసలు ధోకా చేసిందే కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ తీరు దొంగే దొంగా అన్నట్టుగా ఉందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ కపట ప్రేమ చూపుతోందన్నారు. బీసీ కార్డుతో లబ్ది పొందాలని ప్రభుత్వం చూస్తోందని అన్నారు. జనాభా లెక్కలు చూడకుండా ఇష్టం వచ్చినట్లు రిజర్వేషన్లు ఖరారు చేశారని ఫైర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అభ్యర్థులు దొరకడం లేదన్నారు. కేసీఆర్ పథకాలే తప్ప... కాంగ్రెస్ చేసిందేమీ లేదని వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అంటే కమీషన్, కాంగ్రెస్ అంటే కరెన్సీ, కాంగ్రెస్ అంటే కుంభకోణం అని అన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే అమలవుతున్నాయని ధర్మారెడ్డి పేర్కొన్నారు.

# 9న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్



**హైదరాబాద్, అక్టోబరు7:** ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్ కి పిలుపునిచ్చినట్లు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఛలో బస్ భవన్ ధర్నాలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సహా.. బీఆర్ఎస్ నేతలు పాల్గొంటారని తెలిపారు. (మంగళవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో తలసాని శ్రీనివా స్ యాదవ్ మాట్లాడారు. నందినగర్ నుంచి కేటీఆర్.. మెహిదీపట్నం నుంచి హరీశ్‌రావు బస్సులో ప్రయాణం చేసి బస్ భవన్‌కి చేరుకుంటారని చెప్పుకొచ్చారు తలసాని శ్రీనివాస్ యాదవ్. పెంచిన బస్సు చార్జీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అంటూనే.. వాళ్ల కుటుంబ సభ్యులపై భారం వేయడం అన్యాయమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కోల్పోయిన వారి సంఖ్యనే ఎక్కువని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ మేనిపెస్టోలో కూడా చెప్పిందని గుర్తుచేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్. గౌలిగూడ బస్ డిపోను రూ.400 కోట్లకు ప్రైవేట్ వాళ్లకి ఇచ్చారని ఆరోపించారు. మియాపూర్, ఉప్పల్‌తో సహా.. వివిధ డిపోలను ప్రైవేటీకరణ చేయబోతున్నారని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసి కార్మికులను ముంచాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను స్వాగతిస్తున్నామని.. కానీ ఆర్టీసీ డ్రైవర్లతోనే ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాలు నడపడానికి ఆర్టీసీ ఉద్యోగులకు ట్రైనింగ్ ఇవ్వాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో లేను



**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ టికెట్ ఎవరికి ఇస్తారనే ఉత్కంఠ నడుమ బొంతు రామ్మోహన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో తాను లేనని స్పష్టం చేశారు. టికెట్ కోసం ఎవరిని అడలేదని తెలిపారు. అభ్యర్థిని హైకమాండ్ నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థి ఎవరైనా సరే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేస్తానని వెల్లడించారు.కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, సీఎన్ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్‌లు జూబ్లీహిల్స్ సీటు ఆశిస్తున్నారని ప్రచారం ఉంది.వీరిలో నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, సీఎన్ రెడ్డి పేర్లను కాంగ్రెస్ అధిష్టానానికి రేవంత్ సర్కార్ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో ఒకరిని త్వరలోనే ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బొంతు రామ్మోహన్ తాను అభ్యర్థి రేసులో లేనని చెప్పడం గమనార్హం. ఇదిలా ఉంటే.. మరో ఆశావహ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై ఇవాళ క్రిమినల్ కేసు నమోదైంది. నవీన్ యాదవ్ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఈ నెల 4న యూసుఫ్‌గూడలో ఓటర్ల కార్డులను పంపిణీ చేశారు. ఈవ్యవహారాన్ని ఎలక్షన్ కమిషన్ సీరియస్ తీసుకున్నది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి, యూసుఫ్‌గూడ సర్కిల్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి మధురానగర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో నవీన్ యాదవ్‌పై బీఎన్ఎస్ 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసులు నమోదు చేశారు.

# సదరమ్ క్యాంపులో సౌకర్యాల లేమి



- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న దివ్యాంగులు
- తిరగని ఫ్యాన్లు... కూర్చునేందుకు కుర్చీలు కరువు
- సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన దివ్యాంగుల బంధువులు











**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** అర్హులైన దివ్యాంగులను గుర్తించి సదరమ్ సర్టిఫికెట్లు అందించేందుకు ఏర్పాటు చేసిన సదరమ్ క్యాంపులో సౌకర్యాల లేమితో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు, వారి బంధువులకు కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో కొందరు నేలపై కూర్చోవాల్సి వచ్చింది. ఒకవైపు వాతావరణం వేడిగా ఉండగా, ఫ్యాన్లు తిరగక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు జిల్లాలోని భద్రాచలం, పినపాక, మణుగూరు, ఇల్లందు, పాల్వంచ, జూలూరుపాడు, చంద్రుగొండతోపాటు కొత్తగూడెం వంటి పలు ప్రాంతాల నుంచి దివ్యాంగులు వందల సంఖ్యలో తరలి వచ్చారు. మెడికల్ చెకప్ కోసం సదరమ్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, కొందరికి ఆ విషయం తెలియకపోవడం తో నేరుగా క్యాంపునకు రావడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అంతేకాక కొందరికి ఒక అవయవలోపం ఉండగా, ఆన్‌లైన్ సమయంలో మరో లోపం ఉన్నట్లుగా నమోదు చేయడంతో సదరమ్ క్యాంపునకు వచ్చి అవస్తలు పడ్డారు.

**- తిరగని ఫ్యాన్లు... కూర్చునేందుకు కుర్చీలు కరువు**

సదరమ్ క్యాంపు ఏర్పాటు చేసిన సందర్భంలో దూర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో దివ్యాంగులు, వారి బంధువులు వచ్చే అవకాశం ఉన్నందున సరిపడా టెంట్లు, కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, మంగళవారం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రం అటువంటి సౌకర్యాలు ఏవీ కల్పించలేదు. కూర్చునేందుకు కుర్చీలు లేకపోవడంతో దివ్యాంగులు వారికి బల్లా దొరికిన చోటకు వెళ్లి కూర్చున్నారు. డాక్టర్లు పరీక్షించే గది బయట పదుల సంఖ్యలో దివ్యాంగులు వేచి ఉన్నప్పటికీ వారికి కనీసం ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. అంతేకాక తాగేందుకు మంచినీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంతో ఆస్పత్రి సిబ్బందిపై దివ్యాంగులు, వారి బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమి నిర్వహణ అంటూ సిబ్బందిని నిలదీశారు. సమాచార కేంద్రం కూడా లేకపోవడంతో సదరమ్ క్యాంపులో మెడికల్ చెకప్ కోసం వచ్చిన వారు ఎక్కడికి వెళ్లి, ఎవరిని కలవాలని అనే సందిగ్ధం నెలకొంది. వారిని.. వీరిని అడుగుతూ క్యాంపు నిర్వహణ ప్రాంతానికి వెళ్తే వైద్యులు ఆలస్యంగా రావడం, కొన్ని రకాల జబ్బులకు మరొకరోజు క్యాంపు నిర్వహిస్తాం, ఆ రోజు రావాలంటూ వెనక్కి పంపించేశారు. సౌకర్యాల లేమిపై సిబ్బందిని ప్రశ్నించినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇకనైనా సదరమ్ క్యాంపుల్లో దివ్యాంగుల అవసరాలను గుర్తించి, దూర ప్రాంతాల నుంచి వచ్చే బంధువుల ఇబ్బందులు తెలుసుకుని వారికి టెంట్లు, కుర్చీలు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యంతోపాటు సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు

# మంత్రి పొన్నంపై పార్టీ అధిష్ఠానానికి అడ్లూరి లక్ష్మణ్ ఫిర్యాదు



**హైదరాబాద్:** సహచర మంత్రిని ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపుతున్నాయి. మినిస్టర్లు పొన్నం, వివేక్‌పై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవం ఉంటుందని, ఇప్పటికైనా తన తీరు మార్చుకోకపోతే జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలంటూ వ్యాఖ్యానించారు. తాను పక్కనే కూర్చుంటే లేచి వెళ్లిపోవడమేంటని, సహచర మంత్రిని ఆ మాట అంటే చూస్తూ ఉంటావా అని మంత్రి వివేక్‌ను నిలదీశారు. మాదగిలు అంటే అంత చిన్న చూపా అని ప్రశ్నించారు. అంతటితో ఆగని మంత్రి లక్ష్మణ్.. పొన్నం తీరుపై పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు లేఖ రాశారు. త్వరలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గేను కలుస్తానని స్పష్టం చేశారు. రేపటిలోగా పొన్నం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.మరోవైపు వివాదం ముదురుతుండటంతో పీసీసీ రంగంలోకి దిగింది. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్‌తో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేస్తారని ఆశిస్తున్నానని చెప్పారు. అదేవిధంగా ఇరురు మంత్రులతో సమావేశం కావాలని పీసీస నిర్ణయించింది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని సమాచారం అందించింది. మరోవైపు మంత్రి శ్రీధర్ బాబుకు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఫోన్ చేశారు. ఇద్దరితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.దళితులంటే అంత చిన్న చూపా? కాంగ్రెస్ మంత్రుల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. తనను ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్ వివేక్‌పై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సంచలన ఆరోపణలు చేశారు. జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవం ఉంటుందని, ఇప్పటికైనా తన తీరు మార్చుకోకపోతే జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలంటూ వ్యాఖ్యానించారు. తాను పక్కనే కూర్చుంటే లేచి వెళ్లిపోవడమేంటని, సహచర మంత్రిని ఆ మాట అంటే చూస్తూ ఉంటావా అని మంత్రి వివేక్‌ను నిలదీశారు. మాదగిలు అంటే అంత చిన్న చూపా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి వీడియోను విడదల చేశారు.'నేను పక్కన ఉంటే వివేక్ ఓర్చుకోవడం లేదు. పొన్నం ప్రభాకర్ మాదిరిగా నాకు అహంకారంగా మాట్లాడటం రాదు. నా వద్ద డబ్బులు లేవు. పొన్నం ఆయన తప్పు తెలుసుకుంటాడు అని అనుకున్నాను. నేను కాంగ్రెస్ జెండా నమ్ముకున్న వాడిని. మంత్రిగా మూడు నెలల ప్రొగ్రెస్ చూసుకోండి. నేను మాదిగను కాబట్టి నాకు మంత్రి పదవి వచ్చింది. పొన్నం మారకపోతే జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలి. నేను మంత్రి కావడం, మా సామాజిక వర్గంలో పుట్టడం తప్పా?. నేను త్వరలోనే కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ని కలుస్తా. నేను పక్కన కూర్చుంటే వివేక్ లేచి వెళ్లిపోతున్నాడు. నేను పక్కన ఉంటే వివేక్ ఓర్చుకోవడం లేదు. ఇది ఎంత వరకు కరెక్ట్' అంటూ ప్రశ్నలు సంధించారు. దళితులు అంటే చిన్న చూపా? అని ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలు తీవ్ర కలకలం సృష్టించాయి.

# బీజేపీ-బీఆర్ఎస్-టీడీపీ మధ్య సీక్రెట్ డీల్
# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు కుట్ర




**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును అడ్డుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ కుట్ర పన్నుతున్నాయని ఎమ్మెల్సీ విజయశాంతి ఆరోపించారు. బీజేపీ డమ్మీ అభ్యర్థితో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రయత్నిస్తోందని, టీడీపీ కూడా రహస్యంగా బీఆర్ఎస్‌కు మద్దతిస్తోందని ఆమె విమర్శించారు. ఈ అనైతిక రాజకీయాలను ప్రజలకు వివరించి, కాంగ్రెస్ విజయాన్ని సుస్థిరం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో నియోజకవర్గంలో రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఈ ఉపఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని తేలడంతో.. ఆ విజయావకాశాలను దెబ్బతీసేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కాంగ్రెస్ నాయకురాలు, ఎమ్మెల్సీ విజయశాంతి తీవ్ర ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో అనైతిక అవగాహన కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తోందని.. దీనిలో భాగంగానే బీఆర్ఎస్, బీజేపీ, తెలుగుదేశం పార్టీ మధ్య రహస్య ఒప్పందం కుదిరినట్లు ఆమె తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తున్నందున.. కమలం పార్టీతో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ మిత్ర ధర్మం పేరుతో పోటీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ తెర వెనుక అసలు కుట్ర వేరే ఉందని విజయశాంతి సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ ఈ ఉపఎన్నికలో ఒక డమ్మీ అభ్యర్థిని బరిలోకి దింపి.. తన రహస్య మిత్రపక్షమైన బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు వ్యూహాలు రచిస్తోందని ఆమె ఆరోపించారు. పైకి బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు టీడీపీ ప్రకటించినప్పటికీ.. రహస్యంగా తమ కార్యకర్తలు బీఆర్ఎస్ గెలుపు కోసం పని చేయాలని సందేశం పంపినట్లు వార్తలు వస్తున్నాయని విజయశాంతి తెలిపారు. ఎలాగో కాంగ్రెస్ గెలుస్తుంది కాబట్టి, ఆ విజయావకాశాలను దెబ్బ కొట్టాలనే కుట్రతోనే.. టీడీపీ మద్దతు బీఆర్ఎస్‌కు లభించే విధంగా బీజేపీ రహస్య అవగాహన కుదురు కుందని ఆమె విమర్శించారుఈ సందర్భంగా విజయశాంతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కీలక పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను దెబ్బ కొట్టేందుకు అవగాహన కుదుర్చుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ, తెలుగుదేశం పార్టీల అవకాశవాద రాజకీయాన్ని జూబ్లీహిల్స్ ఓటర్లకు వివరించే బాధ్యతను స్థానికంగా ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తీసుకోవాలని ఆమె కోరారు. ఈ మూడు పార్టీల అనైతిక కుట్రను ఛేదించి.. కాంగ్రెస్ విజయాన్ని సుస్థిరం చేయాలని ఆమె పిలుపునిచ్చారు కాగా, మాగంటి గోపినాథ్ మరణంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ తరపున మాగంటి భార్య సునీత బరిలోకి దిగుతుండగా.. కాంగ్రెస్ నుంచి నలుగురు అభ్యర్థులతో షార్ట్ లిస్ట్ రెడీ అయింది. ఇక బీజేపీ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉండగా.. బలమైన క్యాండిడేట్ కోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ స్థానానికి నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా.. నవంబర్ 14న ఫలితం వెల్లడి కానుంది.

# వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి షాక్ పిటిషన్ కొట్టివేత




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసింది. ఈ మేరకు మోహిత్ రెడ్డి పిటిషన్‌పై (మంగళవారం) విచారణ జరిగింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ ముందస్తు బెయిల్ పిటీషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తుడా చైర్మన్‌గా ఉండగా మద్యం ముడుపులు తరలించేందుకు అధికార వాహనాలు వాడారనేది తనపై ఆరోపణలు ఉన్నాయి. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కేసులో ఇరికించారని, దర్యాప్తుకు సహకరిస్తానని, కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ అంశాలు పరిగణనలోకి తీసుకొని తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇవాళ విచారణ చేపట్టి న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

# త్వరలోనే మూల్యం చెల్లించుకుంటారు



**అమరావతి, అక్టోబర్ 7:** టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిపైమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత పాలక మండలి హయాంలో టీటీడీలో భక్తులకు కనీస సదుపాయాలు కరువయ్యాయని విమర్శించారు. దేవస్థానం అంటే రాజకీయ అడ్డా కాదని, గత పాలనలో టీటీడీని రాజకీయాలతో కలుషితం చేశారని ఆరోపించారు. అధికార మదంతో అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుని, భక్తుల విశ్వాసంతో చెలగాటమాడారని మండిపడ్డారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు నాణ్యమైన భోజనం కూడా కష్టమయ్యే పరిస్థితిని సృష్టించిన పాపం గత పాలకులదే అంటూ దుయ్యబట్టారు. భూమన చేసిన వ్యాఖ్యలు స్వామి వారిని, భక్తులను అగౌరవపరిచేలా ఉన్నాయన్నారు. దేవుడితో చెలగాటాలు ఆడితే, ఆయన ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పవిత్రమైన టీటీడీ ప్రతిష్టను దిగజార్చలాని, అపవిత్ర ఆలోచనతో విధిగా వ్యాఖ్యలు చేయడం తగదని హితవుపలికారు. ఇకపై ధార్మిక సంస్థల్లో రాజకీయ జోక్యాన్ని ఉపేక్షించేది లేదని.. పాత తప్పులు పునరావృతం కావని స్పష్టం చేశారు. టీటీడీకి భూమన చేసిన అన్యాయానికి త్వరలోనే మూల్యం చెల్లించుకుంటారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.


# వాల్మీకి అడుగుజాడల్లో నడవాలి




**శ్రీ సత్యసాయి :** రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని, వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం షాది మహల్ ఫంక్షన్ హాల్లో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రామాయణ మహాకావ్యాన్ని రచించడం ద్వారా సీతా రాముల సద్గుణాలును, గొప్పదనాన్ని చెప్పడంతో పాటు ఆదర్శవంతమైన జీవితం, కుటుంబ విలువల నుంచి పాలనా సూత్రాల వరకు , సమాజ శ్రేయస్సుకు అవసరమైన ఎన్నో జీవన సూత్రాలను తెలియచేసిన వాల్మీకి మహర్షికి మనమందరం రుణపడి ఉన్నామన్నారు. రామాయణం సామాజిక నీతిని బోధిస్తుందన్నారు. అందరూ ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దైనందిన జీవితంలో స్ఫూర్తితో జీవించాలన్నారు. అనంతరం వాల్మీకి కుల సంఘాల నాయకులు తెలిపిన సమస్యలను పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు, నాటక ప్రదర్శన లు అందరిని అలరించాయి. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మి నారాయణ, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షులు సి. గంగన్న, టీడీపీ సాధికారత సంఘ అధ్యక్షులు రామాంజనేయులు, టీడీపీ నాయకులు సాకే ఆదినారాయణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి జి. రాజేంద్ర కుమార్ రెడ్డి, సాంఘీక సంక్షేమ శాఖ డిడి, సంబధిత నాయకులు, కుల సంఘాలు తదితరులు ల్గొన్నారు. కలెక్టరేట్‌లో. స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వారు మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వెంకట నారాయణ, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బొత్స ఫ్యామిలీకి తప్పిన ప్రమాదం సిరిమానోత్సవంలో కూలిన వేదిక





**విజయనగరం:** వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కుటుంబానికి పెను ప్రమాదం తప్పింది. విజయనగరంలో సిరిమానోత్సవం చూస్తుండగా వేదిక కూలింది. ఆ సమయంలో బొత్స కుటుంబం వేదికపైనే ఉంది. అయితే ఎటువంటి గాయాలు కాకుండా బొత్స ఫ్యామిలీ సురక్షితంగా బయటపడింది. కానీ ఈ ప్రమాదంలో ఎస్సై, మరో చిన్నారి గాయపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం కన్నులపండువగా సాగుతోంది. పూజారి వెంకటరావు సిరిమాను అధిరోహించారు. చదరగుడి నుంచి విజయనగరం కోట వరకు సిరిమానును ఊరేగిస్తున్నారు. ఈ సిరిమానోత్సవం తిలకించేందుకు సతీసమేతంగా బొత్స సత్యనారాయణ వచ్చారు. ఈ క్రమంలోనే వేదికపై కూర్చుని ఉండగా అది కూలింది.

# పార్టీ మారితే పదవికి రాజీనామా చేయాలి



**నెల్లూరు:** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఖండించారు. దాడికి ప్రయత్నం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఛీఫ్ జస్టిస్‌కి సంబంధించిన అంశం కాదు, సమాజానికి, వ్యవస్థకి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు పార్టీ మారితే.. ఆ పార్టీ ద్వారా పొందిన పదవికి రాజీనామా చేయాలని వెంకయ్యనాయుడు తెలిపారు. రాజ్యాంగంలో 10వ షెడ్యూల్‌ని సవరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ మారి మంత్రులు అవుతున్నారని ఆరోపించారు. చట్టానికి అతీతంగా ఎవరూ వ్యవహారించకూడదని సూచించారు. ప్రజలకి అందించే ఉచితాలు పరిధులు దాటుతున్నాయని వివరించారు. ప్రభుత్వాలు తాహతుకు మించి అప్పులు చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వాలు అప్పులు తెచ్చేటప్పుడు, ఎలా తీరుస్తారో ప్రణాళికలు అసెంబ్లీలో చర్చించాలని ఆయన కోరారు. చట్టసభల్లో కుటుంబ సభ్యులని దూషించడం సరికాదని వెంకయ్యనాయుడు హితవు పలికారు. అలాంటి వారిపై చట్టాన్ని ప్రయోగించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మన దేశంలోనే ఉందని గుర్తుచేశారు. మనదేశ కీర్తిని ప్రతి ఒక్కరూ చాటాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల క్రిమినల్ కేసులుపై రెండేళ్లలోపే విచారణ జరగాలని చెప్పారు. ప్రభుత్వాలు కోర్టుల సంఖ్యలు పెంచి, జడ్జీలని నియమించాలని కోరారు. రాజకీయ వారసత్వానికి తాను వ్యతిరేకమని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు.

# తిరుమలకు ఆగని థ్రెట్ మెయిల్స్ తో అలజడి



**తిరుపతి :** గత కొంత కాలంగా ఫేక్ మెయిల్స్ అలెర్ట్స్ తో వెంకన్న భక్తులు యాత్రికుల్లో ఆందోళన నెలకొంది. భయపడొద్దని ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తున్న పోలీసు యంత్రాంగం టెంపుల్ సిటీ తిరుపతిలో అలెర్ట్ గా ఉంది. అంతేకాదు ఈ వరసగా వస్తున్న మెయిల్స్ పోలీసులకు సవాలు గా మారాయి. అవును టెంపుల్ సిటీ తిరుపతికి గత ఏడాదిగా వస్తున్న బాంబు బెదిరింపు మెయిల్స్ ఆగడం లేదు. దీంతో ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ఆందోళన నెలకొంది. గత ఏడాదిగా వరుస వస్తున్న బెదిరింపులతో పోలీసు యంత్రాంగం కూడా హడలిపోతుంది. గతేడాది అక్టోబర్ 24, 28 వరుసగా బాంబు బెదిరింపు మెయిల్స్ రాగా డిసెంబర్ 9న కపిలతీర్థం రోడ్ లోని రాజ్ పార్క్ హోటల్ కు మెయిల్ వార్నింగ్ వచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి లోనూ ఇస్కాన్ ఆలయానికి, పలు హోటల్స్ కు వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్ ఆందోళనకు గురి చేయగా సింధూర్ ఆపరేషన్ సమయంలో తిరుమలలో ఒక కుటుంబాన్ని బాంబు వేసి పేల్చి వేస్తామంటూ బెదిరింపు కాల్ వచ్చింది. ఈ మేరకు అలిపిరి పిఎస్ లో కేసు కూడా నమోదయింది. ఇక ఈ నెల 3, 6 న తిరిగి వరుసగా పాక్, ఐసిస్ ల పేరుతో బాంబు మెయిల్స్ రాగా ఆగని మెయిల్స్ తో టెంపుల్ సిటీ లో టెన్షన్ వాతావరణం ఉంది. ఎయిర్పోర్ట్ తో మొదలైన బాంబు బెదిరింపు మెయిల్స్ హోటల్స్ కు, ఆలయాలకు వస్తుండడంతో అలజడి నెలకొంది. గతంలో ఎక్స్ అకౌంట్ నుంచి ఎయిర్పోర్ట్ కు బెదిరింపు రాగా ఆ తర్వాత పలు హోటల్స్ బ్లాస్ట్ చేస్తామంటూ ఇమెయిల్స్ వచ్చాయి. టెంపుల్స్ కు సైతం అదే తరహా థ్రెట్ మెయిల్స్ ఇప్పటికే వచ్చాయి. దీంతో పోలీసు యంత్రాంగానికి కంటిమీద కునుకు లేకుండా పోతోంది. థ్రెట్ మెయిల్స్ సీన్ రిపీట్ అవుతుండడంతో టెంపుల్ సిటీ లో టెన్షన్ నెలకొంది. అసలు ఈ మెయిల్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఏఏ అకౌంట్స్ నుంచి పోస్టు చేస్తున్నారన్న దానిపై ఆరా తీస్తున్న పోలీసులు ఐడి లేంటి, ఐపి అడ్రస్సులెక్కడ అన్న దానిపై సైబర్ టీం తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది. తులసి మాల ధరిస్తున్నారా.. ఈ తప్పులు చేస్తే ముప్పే. అలర్టుగా ఉన్న పోలీసు యంత్రాంగం థ్రెట్ మెయిల్స్ తో అణువణువు తనిఖీలు నిర్వహిస్తోంది. యాత్రికులు భక్తులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో బీడీ టీమ్స్ తో తనిఖీలు కొనసాగిస్తోంది. నిఘా కట్టుదిట్టం చేసింది. అయితే ఇప్పటివరకు ఎక్కడా ఒక్క క్లూ కూడా దొరకక పోయినా పోలీసు యంత్రాంగం మాత్రం అప్రమత్తంగానే ఉంటోంది. వర్చువల్ ప్రైవేట్ నెట్వర్క్ టెక్నాల జీని వినియోగించి సైబర్ క్రైమ్ కు పాల్పడుతున్న నేరగాళ్ల ను గుర్తించడం పోలీసులకు కూడా సవాలుగా మారిపోయింది. అడ్రస్ లను కనుగొనలేక పోతున్న సైబర్ ఎక్స్పర్ట్స్ శ్రమ వృధా అవుతుంది. ఫేక్ మెయిల్స్ గా తేల్చుతున్న పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ చేస్తున్న తనిఖీలతో యాత్రికులతోపాటు స్థానికుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది.

# జగన్ ఎన్ని జన్మలెత్తినా పాపాలను కడుక్కోలేరు



**అమరావతి, అక్టోబరు7:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై తెలుగుదేశం ఎమ్మెల్యే, పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కాంపై విమర్శలు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు సోమిరెడ్డి. 'ఏంది జగనన్నా..మీ నోటి వెంట నీతిసూక్తులా' అని ఎద్దేవా చేశారు. దెయ్యాలు వేదాలు వల్లించడం.. జగన్ కల్తీ లిక్కర్ గురించి మాట్లాడటం నూటికి నూరుశాతం ఒక్కటేనని సెటైర్లు గుప్పించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.3500 కోట్ల స్కామ్‌తో ప్రజల ప్రాణాలతో ఆడుకుంది జగన్ ప్రభుత్వం కాదా అని ఫైర్ అయ్యారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. నాణ్యత లేని జే బ్రాండ్స్‌తో..జగన్ తన అక్రమార్జన కోసం నాణ్యత లేని జే బ్రాండ్స్‌తో వేలమంది ప్రాణాలు తీసి.. లక్షల మంది ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. అనేక కుటుంబాలను ఆర్థికంగా నాశనం చేసిన జగన్ రెడ్డీ.. ఇప్పుడు సమర్థించుకుంటారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రపంచ రాజకీయ చరిత్రలో జగన్‌లా ఇంత పచ్చి అబద్ధాలు ఆడే మరొక నాయకుడు ఉండరు... ఉండబోరని ఎద్దేవా చేశారు. క్యాష్ అండ్ క్యారీ సిస్టమ్‌తో జే బ్రాండ్ మద్యమే తాగాలనే కండీషన్ పెట్టి, వేల మంది ప్రాణాలను తీశారని మండిపడ్డారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. జే బ్రాండ్ మద్యం తాగిన లక్షలాది మంది నరకయాతన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం తయారీ, సరఫరా, అమ్మకం ఇలా అన్ని విభాగాలను జగన్ తన చేతిలో పెట్టుకున్నారని ఆక్షేపించారు. వేలకోట్ల నోట్లకట్టలతో డంపు పెట్టుకున్న జగన్.. ఇప్పుడు మాట్లాడుతుంటే విడ్డూరంగా

# పేద విద్యార్థికి వైద్య విద్య.. ఇదే కూటమి సర్కార్ లక్ష్యం




**విశాఖపట్నం, అక్టోబర్ 7:** గత ప్రభుత్వం అసమర్థ పాలన వలన మెడికల్ కళాశాలలకు ఈ దుస్థితి వచ్చిందని మంత్రి సత్య కుమార్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్వతీపురం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేస్తే గత ఐదేళ్లలో కనీసం భూసేకరణ కూడా చేయలేదని. హాస్పిటల్ నిర్మాణానికి టెండర్లు కూడా పిలవలేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం పట్టించుకోలేని వైసీపీ నాయకులు ఇప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. పాడేరులో మెడికల్ కళాశాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా చేయకపోతే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి చేశామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గిరిజన ప్రాంతాలను విస్మరించిందని.. గిరిజన విశ్వవిద్యాలయం రాకుండా అడ్డుకున్నాని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం పాపాలు తమకు శాపాలుగా మారాయని వ్యాఖ్యలు చేశారు. పీపీపీకి ప్రైవేటైజేషన్‌కు తేడా తెలియకుండా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వైద్య కళాశాలలో నిర్మించి ఉంటే ఇప్పుడు ఈ సమస్య ఉండేది కాదన్నారు. వైద్య విద్యను రాష్ట్రంలో పేద విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని స్పష్టం చేశారు. గతంలో తాము చేయలేని పనిని కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తుందని వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారుని వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చితే.. తాము ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా నిర్మాణం చేస్తున్నామని వెల్లడించారు. పాఠశాలలలో కనీసం నిర్వహణ పనులు గత ప్రభుత్వం చేయలేదన్నారు 'జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం మెడికల్ కళాశాలల పరిశీలనకు వస్తే అదే సమయంలో నేను వస్తాను. మెడికల్ కళాశాలల పరిస్థితిని జగన్‌మోహన్ రెడ్డికి వివరిస్తాను. జగన్ ప్యాలెస్ పూర్తిస్థాయిలో నిర్మాణం చేసే వరకు లోపలికి వెళ్లారా. నర్సీపట్నం మెడికల్ కళాశాల పరిశీలనకు వస్తున్న జగన్ పార్వతీపురంలో నిర్మించిన మెడికల్ కళాశాల చూసి అక్కడ పరిస్థితిని వివరించాలి. జగన్ ప్రజలను అసత్యాలు చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు జగన్ కు గుణపాఠం చెప్పిన మార్పు రావడం లేదు. జగన్ ఆత్మ పరిశీలన చేసుకొని బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నాయకునిలా వ్యవహరించాలి. జగన్‌కు అసెంబ్లీకి రమ్మని సవాల్ విసిరినా రాలేదు' అంటూ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు చేశారు.

# జగన్‌కు హెలికాప్టర్ ఓకే రోడ్ షోకు నో పర్మిషన్



**అనకాపల్లి జిల్లా, అక్టోబర్ 7:** విశాఖపట్నం నుంచి మాకవరపాలెం వరకూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రోడ్ షోకు అనుమతి ఇవ్వలేమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ప్రకటించారు. మాకవరపాలెంలో నిర్మితమవుతున్న మెడికల్ కాలేజీ పనులను పరిశీలించడానికి ఈ నెల 9వ తేదీన జగన్ రానున్నారు. ఈ నేపథ్యంలో (మంగళవారం) అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. మాజీ సీఎం జగన్ విశాఖ నుంచి మాకవరపాలెం వరకు 63 కిలో మీటర్ల జాతీయ రహదారిపై కాన్వాయ్‌తో రావడానికి వైసీపీ శ్రేణులు అనుమతులు కోరినట్లు తెలిపారు. విశాఖ నుంచి మాకవరపాలెం వరకు హెలికాప్టర్‌పై మాజీ సీఎం జగన్ వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. జాతీయ రహదారి రోడ్డు మార్గంలో కూడళ్ల వద్ద జన సమీకరణ చేసే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. అంతేకాదు ఇటీవల మాజీ మంత్రి విడదల రజినీపై నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం డిజిటల్ బుక్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. 2022లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని నవతరం పార్టీ కార్యాలయం, తన ఇల్లు, కారుపై విడదల రజిని దాడి చేయించారని.. ఆమెపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి డిజిటల్ బుక్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశానని రావు సుబ్రహ్మణ్యం మీడియాకు తెలిపారు. అనంతరం డిజిటల్ బుక్ యాప్ ద్వారా వచ్చిన టికెట్‌ను చూపించారు. తనకు న్యాయం జరిగితే జగన్ చెప్పినట్లు వైసీపీ కార్యకర్తలకూ న్యాయం జరుగుతుందనే నమ్మకం కలుగుతుందన్నారు. రావు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేయడానికి ముందే డిజిటల్ బుక్ యాప్‌ను చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజిని తన ఇంటి వద్ద పార్టీ నాయకులు, శ్రేణులతో కలిసి ఆవిష్కరించడం గమనార్హం. మొత్తం మీద వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్‌లో ఇలా వరుసగా ఆ పార్టీ నేతలపైనే ఫిర్యాదులు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ ఫిర్యాదుల వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం స్పందించాల్సి ఉంది. మడకశిర వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామిపై వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్‌లో ఫిర్యాదులు నమోదయ్యాయి. మున్సిపల్ చైర్మన్ పదవి ఇప్పిస్తానని రూ. 25 లక్షలు తీసుకున్నారని కౌన్సిలర్ ప్రియాంక, ఆమె తండ్రి విక్రమ్ ఫిర్యాదు చేశారు. అలాగే, అంగన్ వాడీ హెల్పర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 75 వేలు తీసుకున్నారని దొక్కలపల్లి గ్రామానికి చెందిన రామరాజు కూడా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఫిర్యాదు కూడా వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్‌లో నమోదైంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి వ్యవహారం పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా రోడ్డు మార్గంలో మాజీ సీఎం జగన్ పర్యటించేందుకు అనుమతులు నిరాకరిస్తు న్నట్లు చెప్పారు. మాకవరపాలెం మెడికల్ కళాశాల వద్ద హెలిపాడ్ ఏర్పాటు చేసి జగన్ మోహన్ రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చేలా అనుమతి ఇచ్చామన్నారు. తమిళనాడులో ఇటీవల విజయ్ నిర్వహించిన రోడ్ షోలో 41 మంది ప్రాణాలు కోల్పోగా, వందమందికి పైగా గాయపడ్డారని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకరమైన సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందులో భాగంగానే మాజీ సీఎం జగన్ 63 కిలోమీటర్ల మేర కాన్వాయ్‌తో ప్రయాణించేందుకు అనుమతిని నిరాకరించామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు.

# అన్నాడీఎంకే వైపు విజయ్ చూపు పొత్తుపై రహస్య మంతనాలు



**చెన్నై:** కరూర్ తొక్కిసలాట ఘటనతో తీవ్రంగా నష్టపోయిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే).. నష్టనివారణ చర్యలకు దిగిందా?. అధికార డీఎంకేను ఒంటరిగా అడ్డుకోవడం కష్ట సాధ్యంగా మారడంతో.. అన్నాడీఎంకేతో చేతులు కలిపేందుకు సిద్ధమైందా? ఆ పార్టీ అధినేత విజయ్ ఆదేశాల మేరకు క్రియాశీలక నేతలు.. అన్నాడీఎంకేతో మంతనాలు సాగిస్తున్నారా?.. అవుననే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ రాజకీయ వర్గాలు. రెండేళ్ల క్రితం పార్టీని ప్రారంభించిన విజయ్. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కదనోత్సాహంతో సిద్ధమవుతున్న విషయం తెలిసిందే.ఇందులో భాగంగా వారానికి రెండురోజులు జిల్లా కేంద్రాల్లో బస్సు ప్రచారం చేపడుతున్నారు. అధికార డీఎంకేపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కరూర్ ప్రచారం సందర్భంగా తొక్కిసలాట జరిగి.. 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో పోలీసుల అరెస్టుకు భయపడి పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ సహా ప్రముఖులంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోవటంతో ఆ పార్టీ డైలమాలో పడిపోయింది. కరూర్ దుర్ఘటనపై డీఎంకే తీవ్రంగా స్పందించకపోయినా ఆ ఘటనకు బాధ్యులు ఆ పార్టీయేనన్నట్లుగా విజయ్ వేలెత్తి చూపుతున్నారు. ఘటనపై నిరాధార పరస్పర ఆరోపణలకు దిగవద్దని, సంయమనం పాటించాలంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన ప్రకటన్ని సైతం విజయ్ పట్టించుకున్నట్లుగా కనిపించడం లేదు. అయితే ప్రభుత్వ యంత్రాంగం మాత్రం టీవీకేదే తప్పు అన్నట్లుగా చర్యలకు దిగింది. ఇదే సమయంలో బీజేపీ, అన్నాడీఎంకేలు విజయ్ పార్టీని సమర్థిస్తూ ప్రకటనలు చేస్తున్నాయి. అన్నాడీఎంకే అధినేత, మాజీ ఎడప్పాడి పళనిస్వామి అయితే ఈ దుర్ఘటనతో విజయ్‌కి ఎలాంటి సంబంధం లేదన్న ధోరణితో ప్రకటనలు గుప్పిస్తున్నారు అంతేకాకుండా విజయ్‌పై ఎలాంటి విమర్శలు చేయవద్దంటూ రెండు పార్టీల నేతలకు మౌఖిక ఆదేశాలు కూడా వెళ్లినట్లు తెలిసింది. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై, ఆ పార్టీ సీనియర్ నేత హెచ్. రాజా విజయ్‌కి మద్దతుగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. కరూర్ దుర్ఘటనకు రోడ్‌షోలో తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టని డీఎంకే ప్రభుత్వమే ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు.పోస్టర్ల కలకలం.అన్నాడీ ఎంకేతో పొత్తు పెట్టుకోవాలా? వద్దా? అని టీవీకే అధినేత విజయ్ మల్లగుల్లాలు పడుతుండగానే పార్టీ శ్రేణులు ఆయన అనుమతి తీసుకోకుండా మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళని స్వామి(ఈపీఎస)ని స్వాగతిసు ్తన్నట్లు రాష్ట్రవ్యాప్తంగా పోస్టర్లు అంటిస్తున్నారు. ఇకపై ఎడప్పాడి పాల్గొనే సభలు ఎక్కడ జరిగినా విజయ్, ఈపీఎస్ ఫొటోలతో స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేస్తా మంటూ సినీ అభిమానాలు, పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. ఈ పరిస్థితులలో విజయ్‌ని ఎన్డీయేలో చేర్చుకోవాలని అన్నాడీఎంకే నేతలు, బీజేపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎన్డీయేకి, తనకు రాజకీయ ప్రత్యర్థి డీఎంకే కనుక ఉమ్మడి శత్రువైన స్టాలిన్ ఢీకొనడానికి మెగా కూటమిలో చేరటమే మంచిదని విజయ్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ మేరకు టీవీకే క్రియాశీలక నేతలు అన్నాడీఎంకే నేతలతో చర్చిస్తున్నట్లు తెలిసింది.

# కేంద్రమంత్రి సంచలన కామెంట్స్ అందుకే డీఎంకేకు గవర్నర్ శత్రువు

**– వారి అవినీతిని అడ్డుకుంటున్నారని ఆగ్రహం**
**– కేంద్రమంత్రి మురుగన్**



**చెన్నై:** ప్రజాధనం దోచుకుంటున్న డీఎంకేను అడ్డుకుంటున్నారన్న ఆగ్రహంతోనే రాష్ట్ర గవర్నర్‌ను ఆ పార్టీ శత్రువుగా పరిగణిస్తోందని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. కోవై మేట్టుపాళయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ. 2014వ సంవత్సరం కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రాష్ట్రాల అభివృద్ధిపై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి సారించి నిధులు, పథకాల్లో సమన్యాయం పాటిస్తున్నారని తెలిపారు.రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక జిల్లాగా గుర్తింపు పొందిన కోవైలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించే దిశగా బైపాస్ రోడ్డు, మేట్టుపాళయం-అవినాశి నాలుగు రోడ్ల విస్తరణ పనులను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నాలుగున్నరేళ్లకు పైగా అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టి భారీస్థాయిలో అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. ఈ అవినీతిని ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న గవర్నర్‌ను అధికార పార్టీ నేతలు బద్ధశత్రువుగా భావిస్తున్నార ని తెలిపారు. రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో పార్టీ బూత్ కమిటీలను ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయని, అన్నాడీఎంకే కూటమిలో ఉన్న మిత్రపక్షాలను కూడగట్టుకుని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే తమ ఏకైక లక్ష్యమని కేంద్రమంత్రి అన్నారు.

# ఆయుధ కొనుగోళ్లలో స్వావలంబనకు పెద్దపీట



**న్యూఢిల్లీ:** జాతీయ భద్రత సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆయుధ కొనుగోళ్లలో స్వావలంబనకు పెద్దపీట వేస్తున్నట్లు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశీయ సంస్థల నుంచి రూ.1.20లక్షల కోట్లు విలువ చేసే ఆయుధాలు కొను గోలు చేసినట్లు చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధిం చడానికి అవసరమైన మూడు ప్రధాన లక్ష్యాల ప్రాధాన్యత గురిం చి వివరించారు. మంగళవారం దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమ ంలో పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ కీలకమైన రక్షణ సామర్థ్యాల్లో స్వావలంబన సాధించాలని పేర్కొన్నారు. యుద్ధరంగంలో మారుతున్న పరిస్థితుల పట్ల ప్రభుత్వం పూర్తి అవగాహనతో ఉందన్నారు.'భారత్ ఇప్పటికే ఆధునిక సాంకేతిక రంగాలలో ముందంజలో ఉంది. కానీ దేశాన్ని అగ్రగామిగా మార్చడానికి కొత్త, ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాల్లో మరింత అభివృద్ధి సాధించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ మారాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నప్పుడు మూడు ప్రధాన అంశాల ను గుర్తుంచుకోవాలి. మొదటిగా కీలక రక్షణ సామర్థ్యాలలో ఉన్నత స్థాయి స్వావలంబన సాధించాలి. రెండవది, రక్షణ రంగంలో ప్రపంచ ఎగుమతిదారుగా మారాలి. మూడవది, ఆధునిక సాంకేతిక రంగాలలో భారత్‌ను ముందుకు తీసుకెళ్లేం దుకు, కొత్త, ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాల్లో పురోగతి సాధించా లి. ఈ మూడు లక్ష్యాలను చేరుకోగలిగితే, భారత్‌ను 2047 నాటికి వికసిత దేశంగా మాత్రమే కాకుండా, రక్షణ ఆవిష్కరణలో ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మార్చవచ్చు' అని రాజ్?నాథ్ సింగ్ అన్నారు.సాంకేతిక ఆధారంగానే ఆధునిక యుద్ధాలు : రాజ్‌నాథ్ సింగ్ఆధునిక యుద్ధాలు సాంకేతికత ఆధారంగా మారిపోయాయని మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఈ మార్పును స్పష్టంగా చూశామని చెప్పారు. డ్రోన్లు, యాంటీ-డ్రోన్ వ్యవస్థలు, వైమానిక రక్షణ వ్యవస్థలు వంటి నాన్-కాంటాక్ట్ వార్‌ఫేర్ ప్రాముఖ్యత గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఫలితంగా సవాళ్లు, బాధ్యతలు రెండు కూడా పెరిగాయని చెప్పారు. మనం ప్రస్తుత అత్యాధునిక సాంకేతికతలు ఏఐ, క్వాంటం టెక్నాలజీ వంటి వాటిని నేర్చుకోవాలని చెప్పారు. వాటినే కాకుండా ప్రపంచంలో ఇంకా ఆవిష్కరించని భవిష్యత్ సాంకేతికతలపైనా కూడా దృష్టి పెట్టాలని రాజనాథ్ సింగ్ పేర్కొన్నారు.2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశీయ సంస్థల నుంచి రూ.1.20లక్షల కోట్లు విలువ చేసే ఆయుధాలు కొనుగోలు చేసినట్లు రాజ్?నాథ్ సింగ్ పేర్కొన్నారు. '2021-22లో దేశీయంగా ఆయుధాల కొనుగోళ్లు దాదాపు రూ.74వేల కోట్లు ఉండేవి. కానీ 2024-25లో దేశీయంగా ఆయుధాల కొనుగోళ్లు రూ.1.20లక్షల కోట్లకు చేరాయి. ఈ మార్పు కేవలం డేటా మాత్రమే కాదు ప్రభుత్వ ఆలోచన విధానం కూడా. ఏటా రక్షణ శాఖ చేసే ఆయుధ కొనుగోళ్లలో 25శాతం సూక్ష్మ, చిన్న సంస్థల నుంచి సేకరించాలని విధానపరమైన నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం 350కిపైగా రక్షణ పరికరాలను సూక్ష్మ, చిన్న సంస్థల నుంచే కొనుగోలు చేస్తున్నాం. విధానపరమైన సంస్కరణల ద్వారా రక్షణ శాఖ ఆయుధ సరఫరా చైన్‌లో అన్నిసంస్థలను భాగస్వాములను చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం'రాజ్‌నాథ్‌సింగ్ వివరించారు.

# డీబీటీ నగదు బదిలీ ద్వారా ప్రభుత్వానికి రూ. 4.31 లక్షల కోట్లు ఆదా



**ముంబై, అక్టోబర్ 7:** వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తాల్ని ఆయా లబ్దిదారులకు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తున్న విషయం విదితమే. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి అక్షరాలా నాలుగు లక్షల 31 వేల కోట్ల రూపాయలు ఆదా అయిందని మీకు తెలుసా. ఇది నిజం. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ కార్యక్రమం పాల్గొన్న కేంద్ర మంత్రి ఈరోజు విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను కూడా ప్రారంభించారు. ఈ ఆధునిక వ్యవస్థ విదేశీ కరెన్సీ లావాదేవీలను రియల్-టైమ్(తక్షణమే) ప్రాతిపదికన పూర్తి చేస్తుందని ఆమె చెప్పారు. ప్రస్తుతం, ముంబైలో విదేశీ కరెన్సీని సెటిల్ చేయడానికి 36 నుండి 54 గంటలు పడుతుందని.. ఇవాళ ప్రారంభించిన గిఫ్ట్ సెటిల్ మెంట్ వ్యవస్థతో ఈ సమయం చాలా ఆదా అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. ఫలితంగా భారత్ ఇప్పుడు, హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన చేరిందని మంత్రి తెలిపారు.దేశంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫిన్‌టెక్, ఆధార్, , డిజిలాకర్ వ్యవస్థల్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఎలా ముందుకెళ్తున్నామన్న విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని అన్ని వ్యవస్థలు టెక్నాలజీ వారధిగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. గోప్యతను దినదినాభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. తద్వారా దేశం మరింత త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని నిర్మలా సీతారామన్ అన్నారు.ఇప్పటి వరకూ భారత్‌లో ఉన్న బ్యాంకులు లేదా కంపెనీలు అమెరికా డాలర్లు, యూరోలు, యెన్ వంటి విదేశీ కరెన్సీల్లో లావాదేవీలు చేయాలంటే, అవి ఇప్పటివరకు హాంకాంగ్, టోక్యో లేదా లండన్ బ్యాంకుల ద్వారా సెటిల్ చేసేవి. ఈ ప్రక్రియకు 36 నుండి 54 గంటల సమయం పట్టేది. కానీ ఇప్పుడు, ద్వారా భారత్‌లోనే ఈ లావాదేవీలను రియల్ టైమ్‌లో (తక్షణమే) పూర్తి చేయొచ్చు.

# ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం



**ఢిల్లీ, అక్టోబరు7:** గతంలో ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అయ్యాయని.. ఇప్పుడు కూడా దుర్వినియోగం అవుతున్నాయని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే కాదని.. రాష్ట్ర రైతాంగానికి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం నిలవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తమ బాధ్యత నుంచి ఎందుకు తప్పుకుంటుందని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి ఎంత పత్తి ఉత్పత్తి అయితే అంత కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులకు స్మార్ట్ ఫోన్స్ లేకుండానే నిధులు వెళ్తున్నాయా అని ప్రశ్నించారు గిరిరాజ్ సింగ్.తెలంగాణ నుంచి రూ. 65 వేల కోట్ల పత్తి కొనుగోళ్లుఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013 నుంచి 2014 వరకు రూ.12, 500 కోట్ల పత్తి కొనుగోళ్లు చేస్తే.. ప్రస్తుతం రూ.73,000 కోట్ల పత్తి కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు. రూ. 65 వేల కోట్ల పత్తి కొనుగోళ్లు కేవలం తెలంగాణ నుంచే జరిగాయని వెల్లడించారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్నదాతల ఆదాయం రెట్టింపు చేసేందుకు చర్యలు చేపట్టామని ఉద్ఘాటించారు. 2014లో క్వింటా పత్తి ధర రూ.3,700లు ఉంటే.. ఇప్పుడు క్వింటా రూ.7,710ల ధర ఉందని నొక్కిచెప్పారు. మరో గ్రేడ్ రకం గతంలో క్వింటా రూ. 4 వేలు ఉంటే.. ప్రస్తుతం క్వింటా రూ. 8,110లుగా ఉందని వివరించారు. ఇవాళ(మంగళవారం) కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు గిరిరాజ్ సింగ్ తెలంగాణలో 20 లక్షల మంది పత్తి రైతులు ,18 లక్షల హెక్టార్లలో పత్తి పంట పండిస్తున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు సహకారం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఒక అప్లికేషన్ ప్రారంభించిదని... రైతులు అందులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనను కోరారని చెప్పుకొచ్చారు. గతంలో పత్తిని ఎంత సేకరించామో..పత్తిని సేకరిస్తామని స్పష్టం చేశారు.

# కరూర్ తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టులో పిటిషన్



**ఢిల్లీ:** టీవీకే చీఫ్, నటుడు విజయ్ కరూర్ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట అంశం సుప్రీంకోర్టుకు చేరింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని మద్రాస్ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యి ంది. ఈ పిటిషన్ విచారించేం దుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం అంగీకరించింది. ఈ మేరకు అక్టోబర్ 10వ తేదీన సుప్రీంకోర్టులో కేసు విచారణ జరగనున్నట్లు సమాచారం.టీవీకే అధ్యక్షుడు విజయ్ తమిళనాడులోని కరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. సభలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు విజయ్ రూ.20 లక్షల చొప్పున పరిహారం అందించారు. అయితే విజయ్ ర్యాలీలో తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తు కోరుతూ భారతీయ జనతా పార్టీ నేత ఉమా ఆనందన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఉమా ఆనందన్ వేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది.

# ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల సేవ అనుభూతులు పంచుకున్న ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ జీవితంలో కీలక మైలురాయి అందుకున్నారు. ప్రభుత్వాధినేతగా ఆయన 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఓ ప్రభుత్వానికి అధినేత హోదాలో ఆయన 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. అక్టోబర్ 7, 2025 నాటికి తన పరిపాలన 25 ఏళ్లకు చేరుకున్నట్లు ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. ఇదే రోజున 2001లో గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను బలోపేతం చేసేందుకు, దేశ ఉజ్వల ప్రగతి కోసం ఆ నాటి నుంచి శ్రమిస్తున్నట్లు చెప్పారు.చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్న గుజరాత్‌కు తనను సీఎంగా చేశారని, ఆ బాధ్యతలను తనకు పార్టీ అప్పగించినట్లు గుర్తు చేశారు. భారీ భూకంపం, సూపర్ సైక్లోన్, వరుస కరవులతో సతమతం అవుతున్న గుజరాత్‌ను తన చేతుల్లో పెట్టారన్నారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానిగా దేశానికి సేవ చేస్తున్నట్లు మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. తన ట్వీట్స్‌లో వివిధ అనుభవాలను గుర్తు చేశారు.

# సవీందర్‌రెడ్డిపై సీబీఐ చర్యలు తీసుకోవద్దు సుప్రీం కీలక ఆదేశాలు




**ఢిల్లీ, అక్టోబరు7:** సోషల్ మీడియా యాక్టివిస్టు సవీందర్‌రెడ్డి అరెస్టు చేసిన వ్యవహారంలో.. సీబీఐ తదుపరి కార్యాచరణ చేపట్టవద్దని సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సవీందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడంపై దాఖలైన హెబీయస్ కార్పస్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు (మంగళవారం) విచారణ జరిపింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో వ్యక్తిగత హోదాలో సవాలు చేశారు దర్యాప్తు అధికారి గన్నవరపు శ్రీనివాసరావు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్రశర్మ విచారణ చేపట్టారు.సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టినందుకు అక్రమంగా అరెస్టు చేశారని హైకోర్టులో సవీందర్‌రెడ్డి భార్య లక్ష్మీప్రసన్న పిటిషన్ దాఖలు చేశారు. సవీందర్‌రెడ్డిని గంజాయి కేసులో అరెస్టు చేశారని సుప్రీంకో ర్టుకి ఏపీ ప్రభుత్వ దర్యాప్తు అధికారి తరపు న్యాయవాదులు నివేదించారు. ఒక రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని అరెస్టు చేసి... తర్వాత గంజాయి కేసులో ఇరికించారని సవీందర్‌రెడ్డి తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. అదే విషయాన్ని హైకోర్టు పరిశీలించిన తర్వాతే సీబీఐ విచారణకు ఆదేశించిందని న్యాయవాది పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి వ్యక్తిగత హోదాలో పిటిషన్ దాఖలు చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని సవీందర్‌రెడ్డి న్యాయవాది వివరించారు.గంజాయి కేసులో అరెస్టు చేస్తే... దానికి రాజకీయ కారణాలు అన్వయిస్తున్నారని ఏపీ ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా న్యాయస్థానానికి తెలిపారు. ఇరువురి వాదనలను జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. అనంతరం ఈ కేసుపై మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడంతోపాటు... సీబీఐ తదుపరి కార్యచరణ చేపట్టవద్దని ఆదేశించింది ధర్మాసనం. ప్రతివాదులుగా ఏపీ ప్రభుత్వం, డీజీపీ, సీబీఐ, రిలయన్స్ జియో సంస్థతో పాటు... మొత్తం 11 మందిని ఈ కేసులో దర్యాప్తు అధికారి చేర్చారు. ఈ కేసులో పిటిషన్ దాఖలు చేసేందుకు ఏపీ ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది ధర్మాసనం. ఈ పిటిషన్‌పై త్వరలోనే తదుపరి విచారణ చేపడతామని సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# బిహార్ సార్ పై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు




**బిహార్ :** బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా తొలగించిన 3.66 లక్షల ఓట్ల వివరాలను వెల్లడించాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. అక్టోబర్? 9 నాటికి పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించాలని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమల్యా బాగ్చితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. దీనిపై స్పందించిన ఈసీ, భాగంగా విడుదల చేసిన తుది జాబితాలో చాలా మంది కొత్త ఓటర్లు ఉన్నారని సుప్రీంకోర్టుకు చెప్పింది. ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి నుంచి ఇప్పటి వరకు ఫిర్యాదు, అప్పీల్ రాలేదని కోర్టుకు తెలిపింది."కోర్టు ఆదేశాలు ఎన్నికల ప్రక్రియకు మరింత పారదర్శకతను కల్పిస్తాయి. ముసాయిదాలో 65 లక్షల ఓట్లను తొలగించినట్లుగా కనిపిస్తోంది. ఎవరు చనిపోయినా, వలస వెళ్లినా తొలగించండి. దానికి ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఎవరినైనా ఓటరు?గా తొలగిస్తుంటే అందుకు సంబంధించిన రూల్ 21 ప్రకారం అనుసరించండి. ఎవరినైనా తొలగిస్తే వారి వివరాలను ఎన్నికల కార్యాలయాల్లో పెట్టాలని కూడా చెప్పాం. తాజాగా విడుదల చేసిన తుది జాబితాతో ముసాయిదాను పోల్చి చూస్తే ఓటర్ల సంఖ్యలో తేడాలు ఉన్నాయి. ఈ గందరగోళాన్ని నివారించడానికి ఈ వివరాలను బహిర్గతం చేయండి."సుప్రీం కోర్టు3.66 లక్షల మంది పేర్లను తొలగించామన్న ఈసీఅంతకుముందు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ 3.66 లక్షల మంది పేర్లను తొలగించామని తెలిపారు.

# కెప్టెన్‌గా మిచెల్ మార్ష్

## - వన్డే, టీ20 సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్లు ప్రకటన



ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య త్వరలో వన్డే, టీ20 సిరీస్ జరగనున్నాయి. అక్టోబర్ 19న ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే, ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనున్నాయి. ఇప్పటికే భారత జట్టును ప్రకటించింది. వన్డే కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ కు బీసీసీఐ బాధ్యతలు అప్పగించింది. తాజాగా క్రికెట్ ఆస్ట్రేలియా వైట్ బాల్ సిరీస్‌ల కోసం తమ ఆటగాళ్లను ప్రకటించింది. 2 ఫార్మాట్‌లకు కెప్టెన్‌గా ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్‌ను నియమించారు. క్రికెట్ ఆస్ట్రేలియా త్వరలో జరగనున్న ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా వైట్-బాల్ సిరీస్ కోసం తన జట్లను అక్టోబర్ 7న ప్రకటించింది. వన్డేల కోసం 15 మంది సభ్యుల జట్టును ఎంపిక చేయగా, తొలి రెండు టీ20లలో 14 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఆసీస్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ విశ్రాంతి తీసుకున్నాడు, దాంతో మిచెల్ మార్ష్ తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకోనున్నాడు. ఆస్ట్రేలియా వన్డే వరల్డ్ కప్, భవిష్యత్ టోర్నమెంట్‌లకు జట్టును తయారుచేస్తుంది. దాంతో యువ ఆటగాళ్లు మాట్ రెన్షా, మిచెల్ ఓవెన్ వన్డేలలో అరంగేట్రం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎడమచేతి వాటం బ్యాటర్ మాట్ రెన్షా ఆస్ట్రేలియా ఏ జట్టుకు ఆడుతూ నిలకడగా రాణించాడు. దాంతో చివరికి ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు న్డేలో అరంగేట్రం చేయవచ్చు. జూలైలో శ్రీలంక ఏతో జరిగిన మ్యాచ్‌లలో ఇటీవలి స్కోర్లు 80, 106, 62 అతడికి జాతీయ జట్టు నుంచి పిలుపు వచ్చేలా చేశాయి. స్టీవ్ స్మిత్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్ వంటి సీనియర్ ఆటగాళ్లు ఈ ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించడంతో 2027 న్డే ప్రపంచ కప్‌నకు ముందు ఆస్ట్రేలియా దీర్ఘకాలిక ప్లాన్ పై ఫోకస్ చేసింది. దాంతో రెన్షా మిడిల్ ఆర్డర్‌లో ఉండటం చాలా కీలకంమని ఆసీస్ మేనేజ్‌మెంట్ భావించింది. టీమిండియాతో తలపడే ఆస్ట్రేలియా జట్టుకు మిఛెల్ మార్ష్ కేప్టెన్ గా వ్యవహరించనున్నాడు. గాయాల కారణంగా గ్లెన్ మాక్స్‌వెల్, ప్యాట్ కమిన్స్ చోటు దక్కించుకోలేకపోయారు. వెన్ను నొప్పితో బాధపడుతున్నాడు కమ్మిన్స్. ఇప్పడిప్పుడే కోలుకుంటోన్నాడు. అతనికి మరింత విశ్రాంతి ఇవ్వాల్సి ఉందని క్రికెట్ ఆస్ట్రేలియా భావించింది. అతన్ని జట్టులోకి తీసుకోలేదు. కమ్మిన్స్ స్థానంలో మిచెల్ మార్ష్ కు కేప్టెన్సీ పగ్గాలు అప్పగించింది.గ్లెన్ మాక్స్‌వెల్ కూడా గాయం నుంచి కోలుకోలేదు. రిస్ట్ ఫ్రాక్చర్ కు అతను ట్రీట్మెంట్ తీసుకుంటోన్నాడు. దీంతో భారత్ తో జరగబోయే వన్డే, టీ20 జట్ల నుండి అతన్ని తప్పించారు. బిగ్ బాష్ లీగ్ నాటికి మ్యాక్స్ వెల్ కోలుకునే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ మార్నస్ లబుషేన్ పై వేటు పడింది. పేలవ ఫామ్ కారణంగా జట్టులో చోటు కోల్పోయాడు. ఇండియాతో వన్డే, టీ20 సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్లు ఆస్ట్రేలియా వన్డే జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కానోలీ, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), బెన్ ద్వార్షుయిస్, కామెరాన్ గ్రీన్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, మాథ్యూ రెన్షా, జోష్ ఇంగ్లిస్ (వికెట్ కీపర్), మిచెల్ ఓవెన్, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా. టీ20లు (మొదటి 2 మ్యాచ్‌లు): మిచెల్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబాట్, జేవియర్ బార్ట్‌లెట్, నాథన్ ఎల్లిస్, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షుయిస్,జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, మాథ్యూ కుహ్నెమన్, జోష్ ఇంగ్లిస్, మార్కస్ స్టోయినిస్, మిచెల్ ఓవెన్, మాథ్యూ షార్ట్, ఆడమ్ జంపా. ఆస్ట్రేలియా పర్యటన కోసం భారత జట్టు భారత వన్డే జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, యశస్వి జైస్వాల్. భారత టీ20%×% జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), నితీష్ కుమార్ రెడ్డి, శివం దూబే, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), సంజు సామ్సన్ (వికెట్ కీపర్), వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, రింకు సింగ్,హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.

# చాపెల్ చేసిన తప్పు గంభీర్ కూడా చేస్తున్నాడా



గౌతమ్ గంభీర్, హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత జట్టు.. వరుస పరాజయాలు ఎదుర్కొంది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతుల్లో టెస్టు సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన టీమిండియా, ఆస్ట్రేలియా టూర్‌లో టెస్టు సిరీస్ కోల్పోయింది. అయితే 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంతో గంభీర్ ఊరట దక్కింది. ఈ సక్సెస్ తర్వాత భారత జట్టులో చాలా మార్పులు వచ్చాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ వంటి సీనియర్లు, టెస్టు ఫార్మాట్ నుంచి తప్పుకున్నారు. తప్పుకున్నారని అనేకంటే, తప్పించారని అనడమే సమంజసమేమో! తాజాగా ఆస్ట్రేలియా టూర్‌కి ముందు రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించింది భారత జట్టు. శుభ్‌మన్ గిల్‌కి వన్డే, టెస్టు కెప్టెన్సీలను అప్పగించింది. ఇది భారత క్రికెట్ ఫ్యాన్స్‌కి 20 ఏళ్ల క్రితం జరిగిన సంఘటనను గుర్తుకు తెస్తోంది. 2007లో భారత జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న గ్రెగ్ ఛాపెల్, సౌరవ్ గంగూలీని కెప్టెన్సీ నుంచి తప్పించి, రాహుల్ ద్రావిడ్‌కి కెప్టెన్సీ అప్పగించాడు.ఈ మార్పు, టీమిండియాపై తీవ్రంగా ప్రభావం చూపించింది. ఆరంభంలో వరుస విజయాలు అందుకున్న రాహుల్ అండ్ టీమ్, 2007 వన్డే వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ చేతుల్లో చిత్తుగా ఓడి, గ్రూప్ స్టేజ్ నుంచే నిష్క్రమించింది. 2003 వన్డే వరల్డ్ కప్‌లో గంగూలీ కెప్టెన్సీలో ఫైనల్ చేరిన భారత జట్టు నుంచి ఇలాంటి పర్ఫామెన్స్ ఎవ్వరూ ఊహించలేదు. 2003 నుంచి 20 ఏళ్ల తర్వాత 2023లో రోహిత్ శర్మ కెప్టెన్సీలో వన్డే వరల్డ్ కప్ ఫైనల్ చేరింది భారత జట్టు. ఈసారి కూడా ఆస్ట్రేలియా చేతుల్లోనే ఫైనల్ ఓడింది. మళ్లీ 2027లో కొత్త కెప్టెన్ కెప్టెన్సీల ఆడనుంది. ఇవన్నీ చూస్తుంటే 2007 వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టుకి ఎదురైన పరాభవం, 2027 రిపీట్ అవుతుందేమోనని భారత క్రికెట్ అభిమానులు ఆందోళన చెందుతున్నారు .

# గిల్‌పై భారం పడుతోంది

**• మాజీ ప్లేయర్ మహ్మద్ కైఫ్**



భారత వన్డే కెప్టెన్ గా రోహిత్ శర్మను తప్పించి, శుభమాన్ గిల్ కు పగ్గాలు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే టెస్టు కెప్టెన్ గా వ్యవహరిస్తున్న గిల్.. టీ20 జట్టు వైస్ కెప్టెన్ గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. అయితే తక్కువ సమయంలో ఒకేసారి ఇన్ని బాధ్యతలు చేపట్టడం సరికాదని మాజీ ప్లేయర్ మహ్మద్ కైఫ్ వ్యాఖ్యానించాడు. నిజానికి వన్డే పగ్గాలు చేపట్టడంపై గిల్ అయిష్టంగా ఉన్నప్పటికీ, ఫోర్స్ చేసి అతనికి కెప్టెన్సీ ఇచ్చారని తాజాగా తను బాంబ్ పేల్చాడు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈ వ్యవహారశైలిపై కామెంట్లు, పోస్టులతో నెటిజన్లు విరుచుకు పడుతున్నారు. చాలా తక్కువ సమయంలో గిల్ లాంటి ప్రతిభావంతుడిపై అనేక బాధ్యతలు మోపుతున్నారని సెలెక్టర్లు, టీమ్ మేనేజ్మెంట్ ను కైఫ్ విమర్శించాడు. టెస్టు కెప్టెన్ వరకు ఫర్వాలేదని, తాజాగా ఆసియాకప్ లో టీ20 వైస్ కెప్టెన్ గా నూ గిల్ ను ఎంపిక చేశారని, కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ వైదొలిగితే, తనే పగ్గాలు చేపడతాడని, అలాంటి సమయంలో ఇంత హడావిడిగా గిల్ ను కెప్టెన్సీకి ఎందుకు ఎంపిక చేశారని ప్రశ్నించాడు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు వేచి చూసి, అనుభవం పంపాదించాక, అప్పుడు పగ్గాలు అప్పగిస్తే బాగుండేదని వ్యాఖ్యానించాడు. ఏదేమైనా సెలెక్టర్లు కాస్త దుందుడుకు నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించాడు. నిజానికి ఐపీఎల్ ముగిసినప్పటి నుంచి భారత క్రికెట్లో రోహిత్ పేరు నానుతూనే ఉంది. ఆరంభంలో టెస్టు జట్టుకు వీడ్కోలు పలుకగా, గిల్ ను ఇంగ్లాండ్ టూర్ కు సారథిగా ఎంపిక చేశారు. అంతకుముందు 2024లో టీ20 ప్రపంచకప్ లో భారత్ విజయం సాధించింది. ఈ సందర్భంగా రోహిత్.. పొట్టి ఫార్మాట్ కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తాజాగా ఆసీస్ పర్యటన నేపథ్యంలో వన్డే కెప్టెన్సీ నుంచి రోహిత్ ను తప్పించి, గిల్ కు పగ్గాలు అప్పగించారు. ఈనెల 19 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్ కు తను కేవలం బ్యాటర్ గా మాత్రమే జట్టులో ఆడనున్నాడు. 38వ పడిలో ఉండటంతో త్వరలోనే తన కెరీర్ ముగిసినట్లేనని తాజాగా చర్చ జరుగుతోంది. ఇక ఈ టూర్ లో ఆసీస్ తో ఇండియా మూడు వన్డేలు, 5 టీ20లు ఆడనుంది. ఈ సిరీస్ తర్వాత సీనియర్లు రోహిత్, విరాట్ కోహ్లీ భవితవ్యంపై ఒక స్పష్టత రానుంది.

# రిషభ్ పంత్ రీఎంట్రీ!



టీమ్ఇండియా బ్యాటర్, వికెట్ కీపర్ రిషభ్ పంత్ అభిమానులకు గుడ్ న్యూస్. ఇంగ్లాండ్ పర్యటనలో గాయపడి, కొంతకాలం జట్టుకు దూరమైన పంత్ రీఎంట్రీకి సిద్ధమైనట్లు తెలుస్తోంది. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న రిషభ్, త్వరలో జరగబోయే రంజీ ట్రోఫీలో తన సొంత జట్టు దిల్లీ తరఫున బరిలోకి దిగనున్నాడని వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే జట్టులోకి రావడమే కాకుండా రంజీ ట్రోఫీలో పంత్ దిల్లీ కెప్టెన్‌గానూ వ్యవహరిస్తాడని తెలుస్తోంది. నవంబర్ లో దక్షిణాఫ్రికాతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో పంత్ టీమ్ ఇండియాలోకి ఎంట్రీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన అండర్సన్ - తెందూల్కర్ ట్రోఫీ సమయంలో పాదానికి తీవ్ర గాయం కావడంతో పంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ గాయంతోనే ఓ మ్యాచ్‌లో క్రీజ్‌లోకి వచ్చి హాఫ్ సెంచరీ బాదాడు. మెడికల్ స్కానింగ్‌లో పంత్ పాదం వద్ద ఎముక విరిగినట్లు తేలడంతో కనీసం ఆరు వారాలు విశ్రాంతి అవసరమని వైద్య బృందం తెలిపింది. దీంతో అతడు ఆసియా కప్‌లో ఆడలేదు. అలాగే ప్రస్తుతం వెస్టిండీస్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లోనూ పాల్గొనలేదు. ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉన్న పంత్ పూర్తిగా కోలుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రిహాబిటేషన్‌లో ఉన్న పంత్, ఈ వారం చివర్లో బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ టెస్టు హాజరుకానున్నాడు. అయితే ఇప్పటికే ఫిట్‌గా ఉన్న పంత్, మొబిలిటీ వ్యాయామాలు, వెయిట్ ట్రైనింగ్ కసరత్తుల ద్వారా తన పాదాన్ని బలోపేతం చేసుకునే పనిలో ఉన్నాడు. బ్యాటింగ్ ప్రాక్టీస్‌ను కూడా చేస్తున్నాడు. బీసీసీఐ నుంచి మెడికల్ క్లియరెన్స్ వస్తే పంత్ త్వరలో జరగబోయే రంజీ ట్రోఫీలో దిల్లీ జట్టు తరఫున ఆడనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌తో అక్టోబర్ 15 నుంచి జరిగే మ్యాచ్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంది. అయితే పంత్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడం కాస్త కష్టమేనని దిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) అంచనా వేస్తోంది. పంత్ ఫిట్ నెస్ సాధించి దిల్లీ తరఫున బరిలోకి దిగితే ఆ జట్టుకు అతడే కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతానికి, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్ జీ) కి నేతృత్వంలో వహిస్తున్న ఆయుశ్ బదోని దిల్లీ రంజీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.టెస్టుల్లో భారత వైస్-కెప్టెన్ అయిన పంత్, గత ఇంగ్లాండ్ పర్యటనలో అదరగొట్టాడు. ఆ సిరీస్ ఏడు ఇన్నింగ్స్‌లో 68.42 సగటుతో 479 రన్స్ బాదాడు. అందులో రెండు సెంచరీలు, మూడు హాఫ్ శతకాలు కూడా సాధించాడు. అయితే మాంచెస్టర్ టెస్టులో క్రిస్ వోక్స్ వేసిన యార్కర్ కుడి పాదాన్ని తాకడంతో పంత్ విలవిల్లాడాడు. అయినప్పటికీ, ధైర్యంగా తిరిగి బ్యాటింగ్‌కి వచ్చి జట్టుకు విలువైన రన్స్ చేశాడు. పంత్ మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇస్తే, భారత టెస్ట్ జట్టుకు అతని అనుభవం, దూకుడు చాలా ఉపయోగపడతాయి. అయితే బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్ నుంచి ఇంకా ఫిట్‌నెస్ సర్టిఫికేట్ అందకపోవడంతో అక్టోబర్ 19నుంచి ఆసీస్ తో జరగబోయే మూడు వన్డేల సిరీస్ కు పంత్ దూరంగా ఉన్నాడు. కాగా, విండీస్‌తో తాజాగా జరుగుతున్న టెస్టు సిరీస్ కు పంత్ దూరమవ్వడంతో అతడి స్థానంలో ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్ గా ధ్రువ్ జురెల్ ను జట్టులోకి తీసుకున్నారు. ఈ ప్లేయర్ లో అహ్మదాబాద్ లో జరిగిన టెస్టుల్లో సెంచరీ (125) తో అందరినీ ఆకట్టుకున్నాడు. వికెట్ కీపింగ్ లోనూ అదరగొట్టాడు. దీంతో ధ్రువ్ జురెల్ పై అందరూ ప్రశంసలు కురిపించారు. చాలా మంది అతన్ని స్పెషలిస్ట్ బ్యాటర్ గా ఆడించాలని కోరుతున్నారు.

# రోహిత్ శర్మకు అన్యాయమే..!

## - మాజీ క్రికెటర్లు తీవ్ర అసంతృప్తి

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు బీసీసీఐ, ఆస్ట్రేలియా పర్యటనకు ముందు ఒక వివాదాస్పదమైన నిర్ణయం తీసుకుంది. రోహిత్ శర్మ నుంచి వన్డే కెప్టెన్సీని తప్పించి, యంగ్ ప్లేయర్ శుభ్‌మన్ గిల్‌కు కొత్త వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించింది. ఆస్ట్రేలియాతో జరగబోయే 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో రోహిత్ శర్, విరాట్ కోహ్లీ ఆడనున్నారు.. అయితే వారు ఈ సిరీస్‌లో గిల్ కెప్టెన్సీలో ఆడాల్సి ఉంటుంది. బీసీసీఐ తీసుకున్న ఈ నిర్ణయంపై పలువురు మాజీ క్రికెటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.భారత క్రికెట్ దిగ్గజం మహ్మద్ కైఫ్ ఈ విషయంపై బీసీసీఐ నిర్ణయాన్ని తప్పుబట్టారు. శుభ్‌మన్ గిల్‌కు వన్డే జట్టు కెప్టెన్సీని బలవంతంగా ఇచ్చారని, ఈ బాధ్యతను స్వీకరించమని అతనిపై ఒత్తిడి తీసుకొచ్చారని కైఫ్ అభిప్రాయపడ్డారు. ఇంత తక్కువ వయస్సులో గిల్‌కు ఈ భారీ బాధ్యత అప్పగించడం వల్ల, అతని వ్యక్తిగత ప్రదర్శనపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కైఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. శుభ్‌మన్ గిల్‌కు వన్డే కెప్టెన్సీ అప్పగించడంపై టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వివరణ ఇచ్చారు. రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచ కప్ ఆడతాడా లేదా అనే విషయంపై ఇంకా స్పష్టత లేదని అగార్కర్ అన్నారు. పైగా, టీమిండియా వచ్చే రెండేళ్లలో తక్కువ వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడనుంది. ఈ నేపథ్యంలో వరల్డ్ కప్ సమయానికి ముందు జట్టుకు తగినన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉండదు. అందుకే, శుభ్‌మన్ గిల్ ఈ లోపు కెప్టెన్సీ నిర్ణయాలు తీసుకునేందుకు పూర్తిగా సిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతోనే అతనికి సారథ్య బాధ్యతలు అప్పగించినట్లు అగార్కర్ తెలిపారు.రోహిత్ శర్మ నాయకత్వంలోనే భారత జట్టు 2023 వన్డే ప్రపంచ కప్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఫైనల్‌కు చేరుకుంది. దురదృష్టవశాత్తు ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. అయినప్పటికీ, రోహిత్ కెప్టెన్సీలో టీమిండియా 2024 టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. ఆ వెంటనే ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టైటిల్‌ను కూడా కైవసం చేసుకుంది.



# మహిళల వన్డే ప్రపంచ కప్‌లో సౌతాఫ్రికా తొలి విజయం

**• న్యూజిలాండ్ పై సఫారీ జట్టు 6 వికెట్ల తేడాతో విక్టరీ**



మహిళల వన్డే ప్రపంచ కప్‌లో సౌతాఫ్రికా తన తొలి విజయాన్ని నమోదు చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో సఫారీ జట్టు 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 231 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ సాధారణ లక్ష్యాన్ని సౌతాఫ్రికా 40.5 ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్ (101బీ 89 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో అద్భుతంగా ఆడి జట్టుకు సులభ విజయాన్ని అందించింది. సునే లూస్ (83లిబీ 114 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) కూడా అద్వితీయంగా రాణించింది. న్యూజిలాండ్‌కు ఇది వరుసగా రెండో ఓటమి. కాగా, మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ జట్టులో కెప్టెన్ సోఫీ డివైన్ (85బీ 98 బంతుల్లో 9 ఫోర్లు) అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. బ్రూక్ (45బీ 37 బంతుల్లో 6 ఫోర్లు), జార్జియా ప్లిమ్మర్ (31), అమేలియా కెర్ (23) కొంతమేర పరుగులు సాధించారు.

# ఇక ఆషికా రంగనాథ్ ను ఆపడం కష్టమే!



వెండితెరపై వెలుగు రేఖలా తళుక్కున మెరిసే కథానాయికలు కొందరైతే, వెన్నెల ధారలా తెరపై నుంచి జారిపోయి ప్రేక్షకుల గుండె గదుల్లోకి చేరిపోయే కథానాయికలు మరికొందరు. అందం .. ఆకర్షణతో పాటు నాజూకుతనంతో ఆకట్టుకునే అలాంటి కథానాయికల జాబితాలో ఆషికా రంగనాథ్ ఒకరుగా కనిపిస్తారు. ఆషికా అంటే ఆకాశం నుంచి జారిపోయిన అందాల చందమామ అనే విషయం ఆడియన్స్ కి తొలి సినిమాతోనే అర్థమైపోయింది. 'అమిగోస్' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన ఈ తమలపాకు లాంటి అమ్మాయి, ఆ తరువాత 'నా సామిరంగ' సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకి ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. దాంతో ఆ సినిమాకి వెళ్లిన వాళ్లంతా థియేటర్లలో తమ మనసులు పారేసుకునే బయటికి వచ్చారు. ఇక ఈ సుందరి ఇక్కడ వరుసబెట్టి సినిమాలు చేయడం ఖాయమని అనుకున్నారు .. కానీ అలా జరగలేదు. ఆషికా ఆచితూచి కథలను ఎంచుకోవడమే ఇందుకు కారణమని అనుకోవాలి. ప్రస్తుతం ఆమె తెలుగులో 'విశ్వంభర' .. తమిళంలో 'సర్దార్ 2' .. కన్నడలో 'గత వైభవ' సినిమాలతో బిజీగా ఉంది. ఈ కన్నడ సినిమా వచ్చేనెల 14వ తేదీన థియేటర్లకు రానుంది. ఇక 'సర్దార్ 2'.. 'విశ్వంభర' కూడా భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్టులే. ఈ సినిమాలు హిట్ కొడితే ఇక ఆషికను ఆపడం కష్టమేననే టాక్ బలంగా వినిపిస్తోంది. సీనియర్ స్టార్ హీరోల సరసన ఆమె బిజీగా కావడం ఖాయమేనని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఓటీటీకి 'కొత్త లోక'!

ఈ మధ్య కాలంలో మలయాళంలో వచ్చిన ఒక సినిమాను గురించి ఆడియన్స్ ఎక్కువగా మాట్లాడుకున్నారు. సోషల్ మీడియాలో చర్చించుకున్నారు. మలయాళంలో ఇంతవరకూ వచ్చిన లేడీ ఓరియెంటెడ్ సినిమాలను వసూళ్ల పరంగా ఈ సినిమా బీట్ చేసింది. కేవలం 30 కోట్లతో నిర్మించిన ఈ సినిమా, 300 కోట్ల వసూళ్లను రాబట్టడం అందరినీ ఆశ్చర్య పరిచింది. ఇన్నేసి విన్యాసాలు చేసిన ఆ సినిమా పేరే 'లోక 1:చంద్ర'. తెలుగులో 'కొత్త లోక 1: చంద్ర'గా సెట్ చేశారు. కల్యాణి ప్రియదర్శన్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాకి డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించాడు. దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమాలో, నెస్లెన్ .. శాండీ మాస్టర్ .. అరుణ్ కురియన్ .. చందూ ముఖ్యమైన పాత్రలను పోషించారు. ఆగస్టు 28వ తేదీన విడుదలైన ఈ సినిమా, సంచలన విజయాన్ని నమోదు చేసింది. అలాంటి ఈ సినిమా, ఈ నెల 20వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ కానుంది. కథలోకి వెళితే .. చంద్ర అనే యువతి బెంగుళూర్ లోని ఒక ఇంట్లో అద్దెకి ఉంటూ ఒక హొటల్లో జాబ్ చేస్తూ ఉంటుంది. ఆ ఇంటికి ఎదురుగుండా ఉన్న ఇంట్లో 'సన్నీ' ఉంటాడు. అతనికి చంద్ర ధోరణి ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. అప్పటి నుంచి ఆమెను రహస్యంగా గమనించడం మొదలుపెడతాడు. ఆమె దగ్గర సూపర్ పవర్స్ ఉన్నాయనే విషయం అతనికి తెలుస్తుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? ఆ తరువాత జరిగేదేమిటి? అనేది కథ.



# 'మిత్రమండలి' ట్రైలర్.. కావాల్సినంత ఫన్ పక్కా!



టాలీవుడ్ నటుడు ప్రియదర్శి లీడ్ రోల్ లో ఇప్పుడు లేటెస్ట్ మూవీ మిత్రమండలి చేస్తున్న విషయం తెలిసిందే. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ నిహారిక ఎన్ ఎం హీరోయిన్ గా నటిస్తున్న ఆ సినిమాలో మ్యాడ్ ఫేమ్ నటీనటులు విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విజయేందర్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను బీవీ వర్క్స్, సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి కాగా.. దీపావళి కానుకగా అక్టోబర్ 16న సినిమాను రిలీజ్ చేయనున్నారు. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన మేకర్స్.. వరుస అప్డేట్స్ ను రిలీజ్ చేస్తూ ఆసక్తిని పెంచుతున్నారు. ఇప్పటివరకు సినిమా నుంచి విడుదల చేసిన అప్డేట్స్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. ఆడియన్స్ లో అంచనాలు పెంచాయి. ఫన్, మిస్టరీ జానర్ లో మూవీని రూపొందించినట్లు క్లియర్ గా చెప్పేశాయి. అయితే రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో మేకర్స్ మరింత స్పీడ్ పెంచారు. మిత్రమండలి ట్రైలర్ ను తాజాగా విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారిన ట్రైలర్.. ఆకట్టుకుంటోంది. సినీ ప్రియులను కడుపుబ్బా నవ్విస్తోంది. ప్రస్తుతం ట్రెండ్ కు అనుగుణంగా సరదా డైలాగులతో మెప్పిస్తోంది. ఒకే అమ్మాయి కోసం స్నేహితులంతా గొడవ పడడంతో ఇలాంటి మహిళా మండలి కోసమే మిత్రమండలి కనుమరుగవుతోందటూ చెప్పిన కొన్ని డైలాగ్స్ ఫుల్ ఫన్నీగా ఉన్నాయి. ముఖ్యంగా ట్రైలర్ లో రాగ్ మయూర్, ప్రసాద్, విష్ణుతో వెన్నెల కిషోర్ చేసిన కామెడీ మెయిన్ హైలెట్ గా నిలిచేలా ఉంది. సత్య, నిహారిక, వెన్నెల కిషోర్ తమ కామెడీ టైమింగ్ తో ప్రేక్షకులను నవ్విస్తున్నారు. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం సన్నివేశం కూడా అందరినీ ఎంతగానో ఆకట్టుకుంటోంది. సినిమా ప్రేక్షకులకు కావాల్సినంత ఫన్ ఇస్తుందని ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. కాగా మూవీ విషయానికొస్తే.. బన్నీ వాస్ సమర్పిస్తున్న మిత్రమండలి చిత్రాన్ని కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బన్నీ వాస్ ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మరి ఆయన ప్రొడక్షన్ బ్యానర్ పై తొలి మూవీగా వస్తున్న మిత్రమండలి ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# కింగ్ సెంచరీలో కీర్తి సురేష్!



కింగ్ నాగార్జున 100వ చిత్రం రా. కార్తిక్ దర్శకత్వంలో ప్రారంభమైన సంగతి తెలిసిందే. యాక్షన్ ప్రధానంగా సాగే చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. నాగార్జున వందవ సినిమా కావడంతో బయట నిర్మాణ సంస్థలు వేటికి అవకాశం ఇవ్వకుండా తానే స్వయంగా నిర్మించాలని నాగార్జున ముందే డిసైడ్ అయ్యారు. అనుకున్నట్లే ప్రాజెక్ట్ గ్రాండ్ గా ప్రారంభమైంది. అయితే ఇందులో హీరోయిన్ ఎవరు? అన్నది ఫైనల్ కాలేదు. సాధారణంగా లాంచింగ్ రోజునే హీరోయిన్ కూడా ఈవెంట్ లో పాల్గొని దేవుడి పటాల ముందు కొబ్బరి కాయ కొడతారు. %కానీ నాయిక ఎంపిక ఫైనల్ కాకపోవడంతో కార్యక్రమంలో గ్లామర్ కనిపించలేదు. మరి హీరోయిన్ ఛాన్స్ ఎవరికి ఇస్తున్నారు? అంటే మలయాళ బ్యూటీ కీర్తి సురేష్ పేరు తెరపైకి వచ్చింది. మేకర్స్ ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నారుట. హీరోయిన్ ఎంపిక విషయంలో నాగ్ ఇన్వాల్వ్ అయినట్లు చెబుతున్నారు. ఆయన ఆదేశాలతో పాటు పాత్రకు కూడా పర్ఫెక్ట్ గా సూటువుతుందని కార్తీక్ భావించడంతో కీర్తికి టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. నాగ్ సరసన పర్ఫెక్ట్ జోడీ అవుతుంది. అమ్మడు వయసు ఇప్పటికే 33 సంవత్సరాలు. మన్మధుడు2 అనంతరం మరోసారి: సీనియర్ హీరోలతో పని చేసిన అనుభవం ఉంది. భోళాశంకర్ లో చిరంజీవికి సోదరి పాత్రలో నటించింది. రవితేజ , నాని, మహేష్, పవన్ కళ్యాణ్ లాంటి స్టార్లకు హీరోయిన్ గా నటించింది. లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు చేసింది. ఈ నేపథ్యంలో నాగ్ సరసన అన్ని రకాలుగా పక్కాగా సూటవుతుంది. నాగార్జునతో తెరను పంచుకోవడం కొత్త కాదు. గతంలో నాగార్జున హీరోగా నటించిన %-%మన్మధుడు 2%-% లో గెస్ట్ అప్పిరియన్స్ ఇచ్చింది.

# ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో మహేశ్ బాబు కొత్త మల్టీప్లెక్స్.. 2026 సంక్రాంతికి ప్రారంభం!






సూపర్‌స్టార్ మహేశ్ బాబు, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్‌తో కలిసి అందిస్తున్న ఏఎంబీ సినిమాస్ బ్రాండ్ ఇప్పుడు హైదరాబాద్ సినిమా అభిమానులకు మరింత చేరువకానుంది. గచ్చిబౌలిలో విజయవంతమైన తమ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, తెలుగు సినిమాలకు గుండెకాయ లాంటి ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో భారీ మల్టీప్లెక్స్‌ను నిర్మిస్తున్నారు. ఏఎంబీ సినిమాస్–ఫేజ్ 2గా వస్తున్న ఈ థియేటర్ నిర్మాణ పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి.విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ మల్టీప్లెక్స్‌ను 2026 సంక్రాంతి పండుగ కానుకగా ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం మహేశ్ బాబు టీమ్, ఏషియన్ సినిమాస్ బృందం పనులను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. మొత్తం 7 స్క్రీన్లతో రూపుదిద్దుకుంటున్న ఈ థియేటర్‌లో ప్రతి ఒక్కటీ అత్యుత్తమ వీక్షణ అనుభూతిని అందించేలా తీర్చిదిద్దుతున్నారు. అత్యాధునిక ప్రొజెక్షన్ టెక్నాలజీ, డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్, సౌకర్యవంతమైన ప్రీమియం సీటింగ్‌తో గచ్చిబౌలి ఏఎంబీని మించిన స్థాయిలో దీనిని నిర్మిస్తున్నట్లు సమాచారం.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com